

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 306 | ది. 17-2-2026 | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 306 | Date : 17-2-2026 | Tuesday | Pages : 8 | Rs.1/- |


## ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ మంత్రి తుమ్మల భేటీ



**అమరావతి,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం, సహకారంతో పరిష్కరించాల్సిన పలు అంశాలను భేటీలో ప్రస్తావించారు. రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, రైల్వే లైన్లు వంటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా తెలుగు రాష్ట్రాల ప్రజలకు లబ్ది జరుగుతుందని తుమ్మల అభిప్రాయపడ్డారు. వీటికి సంబంధించిన పలు వివరాలను ముఖ్యమంత్రికి ఆయన తెలియచేశారు. రెండు ప్రభుత్వాలు ఉన్నత స్థాయిలో సంప్రదింపుల ద్వారా ఈ సమస్యల పరిష్కారం జరుగుతుందని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏపీకి కొత్త దశ-దిశ

- ప్రజా సాధికారత, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తున్నాం
- బిల్ గేట్స్‌తో సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పాలనా విధానాలపై సీఎం ప్రజెంటేషన్
- కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలుపై బిల్ గేట్స్ ప్రశంసలు
- డిజిటల్ విప్లవంలో చంద్రబాబుది కీలక పాత్రగా గేట్స్ కితాబు

**అమరావతి, ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ అమరావతి రాక చారిత్రాత్మకంగా నిలుస్తుందని, ఆంధ్రప్రదేశ్ ప్రజల సాధికారతకు ఇది దోహదపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సోమవారం బిల్ గేట్స్ అమరావతి పర్యటనలో భాగంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి... ముందుగా గేట్స్, ఆయన బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్‌తో తన అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. 1997లో మొదటిసారి తాను బిల్ గేట్స్‌ను కలిశానని... హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించానని... మైక్రోసాఫ్ట్ రాకతో ఇప్పుడు హైదరాబాద్ ఐటీ రంగంలో మేటిగా నిలబడిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తాను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీలో వనరులకు లోటు లేదని, సంపద సృష్టి జరగాల్సి ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్నినెంబర్‌వన్ చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.





**చంద్రబాబు విజనరీ అని ఆనాడే తెలిసింది..** సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్...డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. తాను మొదటిసారి చంద్రబాబును కలిసినప్పుడు ఆయన ఆలోచనల్లో ముందుచూపు ఉందనే విషయాన్ని ఆనాడే గ్రహించినట్టు వెల్లడించారు. ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత దగ్గరగా ఉన్నారని చెప్పారు. గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులని తెలిపారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నది తన ఆశయమన్నారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని అభినందించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారికి సరైన రీతిలో... తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి ఏఐ సహాయపడుతుందన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావడానికి ఏఐ-టెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పిన బిల్ గేట్స్, వ్యవసాయం రంగం చాలా ముఖ్యమైనదిగా అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం...టెక్నాలజీని రైతులకు అందించేందుకు... ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేస్తూ కృషి చేయడాన్ని అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఇంతలా వినియోగంచడం లేదని... కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం మంచి పరిణామమని చెప్పారు. విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి... ప్రాణ నష్టం జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు చేయడం బాగుందన్నారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని సమావేశంలో బిల్ గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు.

**పది సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 సాకారం..** స్వర్ణాంధ్ర 2047 విజన్, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పాలసీలు, లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇచ్చారు. జీరో పావర్టీ, సంపూర్ణ ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత, రైతు-అగ్రి టెక్, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఎనర్జీ-ఫ్యూయల్, ప్రోడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్... ఈ 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానమని... దీనికి ఆధార్ ధృవీకరణ, వ్యక్తిగత, కుటుంబ డేటా లేక్, కుటుంబ సమాచారం, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వ సమగ్ర డేటా, అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరణ, వాట్సాప్ గవర్నెన్స్, డిజి వెరిఫై వంటి అప్లికేషన్ల వినియోగం ద్వారా భవిష్యత్ కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి అన్నారు. టెక్నాలజీ ఆధారిత థీమాటిక్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే క్వాంటం వ్యాలీ-డిజైన్ - ఫౌండ్రీగా అమరావతి, డేటా-ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు, ఎలక్ట్రానిక్స్-ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 98 ఏఐ యూజ్ కేసులు, 43 హ్యాకథాన్లు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నాయన్నారు. మొత్తం 7 డేటా లెక్ ప్రాజెక్టులు ప్రారంభించినట్టు తెలిపారు.

**2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా రాష్ట్రం..** స్వర్ణాంధ్ర-2047 నాటికి ముఖ్య లక్ష్యాలు నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 'ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా తీర్చిదిద్దడం, తలసరి ఆదాయం ప్రస్తుతం 3,400 డాలర్లు ఉండగా 2047 నాటికి దీనిని 42,000 డాలర్లకు పెంచడం, ఎగుమతులు 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు పెంచడం, నిరుద్యోగితను 4.1 శాతం నుంచి 2 శాతం కన్నా తగ్గించడం, మహిళా కార్మికుల సంఖ్యను 45.8 శాతం 80 శాతానికి పెంచడం, ప్రస్తుతం 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతానికి తీసుకువెళ్లడం, 95 శాతం నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండేలా చూడటం, సగటు ఆయుర్ధాయం 85 ఏళ్లు, ఎంఎంఆర్ ప్రతీ లక్ష జననాలకు 5, ఐఎంఆర్ ప్రతీ వెయ్యి జననాలకు 2 కన్నా తగ్గించగలగడం, గర్భిణులలో రక్తహీనత సమస్య, వైద్యంపై వ్యక్తిగత ఖర్చు 5 శాతానికి తగ్గించడమే లక్ష్యం'గా సీఎం చెప్పారు.

**విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రాధాన్యం..** విద్యారంగంలో అనుసరిస్తున్న ఆధునిక విధానాల గురించి కూడా ముఖ్యమంత్రి స్పష్టంగా తెలియజేశారు. ఇందుకు గేట్స్ ఫౌండేషన్ అందిస్తున్న సహకారంపైనా సంతోషం వ్యక్తం చేశారు. లిటరసీ-న్యూమరసీపై రాష్ట్ర ప్రభుత్వ దృష్టి పెట్టిందని, 35,000 పాఠశాలల్లో చదువుతున్న 13.4 లక్షల విద్యార్థులకు ఉపకరించేలా ఓఆర్ఎఫ్ టూల్ వినియోగిస్తున్నామని సీఎం చెప్పారు.

# నైస్... గుడ్... గ్రేట్

## బిల్ గేట్స్ అమరావతి పర్యటన హైలైట్స్

**రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై గేట్స్ ప్రశంసలు**



**అమరావతి,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ అమరావతి పర్యటన ఆసక్తికరంగా సాగింది. గత అనుభవాలను గుర్తు చేసుకుంటూ... భవిష్యత్ ప్రణాళికలపై చర్చించుకునేలా బిల్ గేట్స్ పర్యటన జరిగింది. గేట్స్ పై ఉన్న అపారగౌరవంతో నారా లోకేష్ సహా నలుగురు మంత్రులను గన్నవరం విమానాశ్రయానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం స్వాగతం పలికింది. సచివాలయంలో మొదటి బ్లాకులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిల్ గేట్స్ కు ఆత్మీయ స్వాగతం పలికారు. మొదటి బ్లాక్ వద్ద తనకు స్వాగతం పలికిన సీఎం చంద్రబాబును చూడగానే కారు దిగుతూనే హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ.. అంటూ గేట్స్ ముఖ్యమంత్రిని అప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం సహా ఇతర కెబినెట్ మంత్రులను బిల్ గేట్స్ కు సీఎం చంద్రబాబు పేరు పేరునా పరిచయం చేశారు. బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన ఛాంబర్లోకి వచ్చిన బిల్ గేట్స్ కు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి నిలువెత్తు చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించారు. శ్రీవారి ప్రాసస్త్యాన్ని.. తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని బిల్ గేట్స్ కు సీఎం వివరించారు. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం ఆర్టీజీ సెంటర్ కు గేట్స్ ను ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. ఆ విభాగం పనితీరును వివరించారు. పాలనా వ్యవహారాల్లో, విపత్తుల్లో, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్డ్ టెక్నాలజీని ఏ విధంగా వినియోగించుకుంటున్నామనే అంశాన్ని ఉదాహరణలతో సహా ముఖ్యమంత్రి వివరించారు. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ప్రోగ్రెస్ ను ముఖ్యమంత్రి వివరించగా... "దట్స్ నైస్" అంటూ మెచ్చుకున్నారు. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగం గురించి గ్రేట్ అంటూ గేట్స్ అభినందించారు. డేటా లేక్, వాట్సాప్ గవర్నన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడాన్ని అభినందించారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించగలిగితే... పేద వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందని గేట్స్ అభిప్రాయపడ్డారు. అమరావతి రాజధాని ప్రణాళికలను.. బ్లూ-గ్రీన్ కాన్సెప్టును, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీగా నిర్మిస్తున్న విధానాన్ని తెలుసుకున్న బిల్ గేట్స్"" గ్రేట్ వర్క్"" అంటూ రాజధాని మాస్టర్ ప్లాన్ ను మెచ్చుకున్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎటువంటి ప్రణాళికలతో రాజధాని నిర్మిస్తున్నామనే విషయాన్ని సీఎం చంద్రబాబు వివరించారు. రాజధాని ప్రాంతంలో మొత్తంగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించే దిశగా... ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్టు గేట్స్ కు సీఎం చెప్పారు.

# అన్నదాతలకు ఏఐ, అగ్రిటెక్ సేవలు అత్యద్భుతం

- వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన బిల్ గేట్స్
- సాగులో యాప్, డ్రోన్ల వినియోగం పరిశీలన
- సీఎం చంద్రబాబుకు, బిల్ గేట్స్‌కు రైతుల ఆత్మీయ స్వాగతం





**అమరావతి,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాంకేతిక వినియోగం, ఏఐ ఆధారిత రైతు సేవలను గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఉండవల్లి కరకట్ట సమీపంలోని వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సందర్శించిన గేట్స్‌కు రైతుల్లో సాంకేతిక వినియోగాన్ని పెంచే కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వివరించారు. వ్యవసాయం-అనుబంధ రంగాల్లో దిగుబడి పెంపు, సాగు ఖర్చు తగ్గింపుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను తెలిపారు. అలాగే నాణ్యమైన పంట ఉత్పత్తుల ఎగుమతులకు ప్రత్యేక కార్యాచరణ అవలంభించి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో అనలిటిక్స్, మానిటరింగ్ డాష్‌బోర్డులు వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మణి, అన్నపూర్ణ... ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించిన ఏపీఏఐఎంఎస్ రైతు యాప్ గురించి గేట్స్‌కు తెలియజేశారు. ఈ యాప్ ద్వారా ఏ పంటలు పండించాలి, సాగునీటి నిర్వహణ, నేల స్వభావం, ధరలు, మార్కెట్ సమాచారం, పురుగు మందుల నియంత్రణ వంటి విషయాలు సులభంగా తెలుసుకుంటున్నామని చెప్పారు. ఏఐ ద్వారా పంట తెగుళ్ల గుర్తింపు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే డ్రోన్ సేవలు పొంది పురుగు మందులను వినియోగిస్తున్న తీరును తెలిపారు. బిల్ గేట్స్ సమక్షంలోనే రైతులు ఏఐ టూల్ ఉపయోగించి, వ్యాధి సోకిన మొక్క ఫోటో తీసి అప్లోడ్ చేశారు. ఆ వ్యాధిని ఏఐ గుర్తించి నివారణ సూచనలు అందించింది. అనంతరం డ్రోన్ సేవను బుక్ చేయగా, మొక్కకు వ్యాధి వ్యాపించిన చోట డ్రోన్ స్ప్రే చేసింది. ఇది స్వయంగా చూసిన బిల్ గేట్స్... రైతులకు ఏఐ-అగ్రి టెక్ సేవలు అత్యద్భుతంగా అందిస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. మరోవైపు స్థానిక రైతులతో బిల్ గేట్స్ ముఖాముఖి చర్చించారు. మొదటగా వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి, బిల్ గేట్స్‌కు మహిళా రైతులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. వారు స్వయంగా వండి తీసుకుచ్చిన స్థానిక వంటలను బిల్ గేట్స్ రుచి చూశారు. ఈ సందర్భంగా సేంద్రీయ సాగు పద్ధతులతో పండించిన ఉత్పత్తులను బిల్ గేట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**మహారాజశ్రీ రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు విజయవాడ**

**O.S. No.76/2025**

Between :

ప్రేముల జయకుమార్ మరియు ఒకరు ------పిటీషనర్

మరియు

మందా శిరీష మరియు 9 మంది ఇతరులు ------రెస్పాండెంట్స్

రెస్పాండెంట్ నెం.8

మందా రాణి,

భర్త : తెలియదు (పిటీషనర్స్)కు

R/o : RCM చర్చి ప్రక్కన,

రాయనపాడు గ్రామం,

విజయవాడ రూరల్ మండలం,

ఎన్‌టిఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్

సెల్ : 9492935629

పై నెంబరు పిటీషన్ నందు రెస్పాండెంట్ నెం.8కు నోటీసులు (కోర్టు అమీనా గారి ద్వారా మరియు రిజిష్టర్డ్ పోస్ట్ ద్వారా) అమలు కానందున సదరు పిటీషన్ లోని రెస్పాండెంట్ నెం.8 యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.23-03-2026వ తేదీన ఉదయం 10.30ని॥లకు రెస్పాండెంట్ నెం.8 స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై సదరు కేసు నందు ఆక్షేపణలను తెలియపరుచుకోవలసినదిగా, లేని యెడల సదరు పిటీషనులో రెస్పాండెంట్ నెం.8కు పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయుటమైనది.

**వాయిదా తేదీ : 23-03-2026**

**//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//**

**ఇట్లు**

**Pesaramalli Babu Rao**

Advocate

Ibrahimpatnam, Vijayawada

Cell : 9966333920

విజయవాడ

11-02-2026

**మహారాజశ్రీ విజయవాడ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో**

**O.S. No.752/2023**

Between :

State Bank of India

Madhuranagar Branch

Rep By Its Branch Manager --------Plaintiff

And

Sindhiya Kalyan Chakravarthi

S/o Ganapathi Rao

R/o D.No: 165/J, S.T.P.M.

Railway Colony, S.N.Puram

Vijayawada-520011 --------Defendant

పై నంబరు దావా వాది బ్యాంకు వారు మీపై దావా బాకీ రూ.2,86,794/- మరియు ఖర్చులు వగైరాలు రాబట్టుకొనుటకు పైకోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు యెట్టి అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకునే నిమిత్తము ది.6-04-2026వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయముగా గాని లేక న్యాయవాది గారి ద్వారా గాని, హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

**ఇట్లు**

**డాక్టర్ ధారా సత్యనారాయణ**

**వాది బ్యాంకు తరపు న్యాయవాది**

**డాక్టర్ కడియాల బుచ్చిబాబు రోడ్డు,**

**మొగల్‌రాజపురం,**

**విజయవాడ-520010**

విజయవాడ

16-02-2026

**IN THE COURT OF THE II ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIJAYAWADA**

O.S.No : 182/2025

Between :

Thunuguntla Rajendra Prasad -------Plaintiff

And

1. Shaik Mahaboob
2. Thunuguntla Ashok Kumar -------Defendants

**NOTICE**

To

Shaik Mahaboob,

son of Shaik Chinna Tummal Saheb, R/o. D.No : 21-12-50,

Kobbari Thota, Maduranagar,

Vijayawada-520 011,

NTR Dist.,

Please take notice that the Plaintiff was filed above Original Suit against you and another and the same stands posted to 27-02-2026 for appearance on that day at 10-30 a.m., either to person or through an advocate failing which the matter will be heard and determined in your absence.

**(By order of this Hon'ble Court)**

**P.L.Prabhakar**

**Akula Sandhya**

Advocates

Vijayawada

Cell No : 9440138181

Vijayawada

Dt : 12-02-2026

# ఫిబ్రవరి 17న కోర్టు విధులను బహిష్కరించనున్న జిల్లా న్యాయవాదులు

## -రాష్ట్ర న్యాయవాదుల సంఘం తీర్మానం




**విజయవాడ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** హైదరాబాదులో న్యాయవాది మహమ్మద్ ఖదీర్ దారుణ హత్యలను ఖండిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ మరియు ఆంధ్ర రాష్ట్ర న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎ కె బాష ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల సంఘం అధ్యక్షులు మరియు జనరల్ సెక్రెటరీ లు అయిన పిచ్చుక శ్రీనివాస్ రావు మరియు రాజలక్ష్మి పెండెం, బెజవాడ బార్ మానవ హక్కుల సంఘం కన్వీనర్ అయిన వేముల రవీంద్రనాథ్ మరియు కో కన్వీనర్ సతీష్ మరియు శ్రీ రానా ప్రసాద్ ల ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అత్తాపూర్ న్యాయవాది మహమ్మద్ ఖదీర్ హత్యను తీవ్రంగా ఖండిస్తూ, వెంటనే ఖదీర్ మరియు స్వప్న న్యాయవాదుల హత్య కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు లను ఏర్పాటు చేసి త్వరితగతిన కేసులో విచారణ జరిపి ముద్దాయిలను కఠినంగా శిక్షించాలని నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా పోలీసు వ్యవస్థ మెతక ధోరణిని విడనాడి చట్టాన్ని కాపాడే న్యాయవాదులకు రక్షణ కల్పించాలని, భవిష్యత్తులో న్యాయవాదులపై ఇటువంటి దాడులు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ఎన్నో సంవత్సరాల నుండి న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకుని పరిరక్షణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేసారు. తిరుపతిలో రాష్ట్ర పౌర హక్కుల సంఘం సమావేశం జరుగుతుండగా పురాతన కార్టూన్ ని పబ్లిష్ చేశారని, ఆ ప్రోగ్రాం నిర్వాహకులు అయిన పౌర హక్కుల సంఘం అధ్యక్షులు మరియు సీనియర్ న్యాయవాది అయిన కె క్రాంతి చైతన్య పై తిరుపతి పోలీసు వారు అక్రమంగా దేశద్రోహ కేసు బనాయించడానికి తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులు సమాజంలో గౌరవప్రదమైన రాజ్యాంగబద్ధంగా న్యాయవాద వృత్తి చేసే వారిని, చిరుతప్పులకు దేశద్రోహం కేసులు బనాయించడాన్ని ఖండిస్తూ పై కేసును తిరిగి విచారించాలని తీర్మానం చేయడమైనది. ఈ సమావేశానికి సీనియర్ న్యాయవాది అబ్దుల్ మతిన్, ఏ సరస్వతి, పౌర హక్కుల సంఘం సభ్యురాలు అయిన వైశాలి, ఇతర సభ్యులతో పాటు బెజవాడ బార్ జనరల్ సెక్రెటరీ కె.వి రంగారావు, వైస్ ప్రెసిడెంట్ పిల్లా శ్రీనివాసరావు, స్పోర్ట్స్ సెక్రెటరీ పలగాని రవి హాజరైనారు. ఈ సందర్భంగా ఈ ఘటనలను ఖండిస్తూ రేపు కృష్ణాజిల్లాలోని అన్ని బార్ అసోసియేషన్లలో న్యాయవాదులందరూ కోర్టు విధులకు బహిష్కరణ చేయాలని తీర్మానం చేశారు.

# అమ్మవారి దయతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

● అనిల్ కుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ):** శ్రీశ్రీ శ్రీ భవాని శంకరలాయం 19వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.నల్లగండ్లకు చెందిన బొల్లంపల్లి సత్యనారాయణ రెడ్డి మిత్రబృందం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మారబోయిన అనిల్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.ప్రత్యేక అలంకరణలతో ఆలయం అందంగా ముస్తాబై ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

# ప్రజా గొంతుకకు పట్టం!!

**41వ డివిజన్ నూతన సారథిగా సూర్య**
**ఎర్రజెండా నీడలో అభివృద్ధి బాట**
**కార్పొరేటర్‌గా మార్కపురి ప్రమాణం**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 16 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగర పాలక సంస్థ 41వ డివిజన్ కార్పొరేటర్‌గా సిపిఐ అభ్యర్థి మార్కపురి సూర్య సోమవారం అత్యంత వైభవంగా ప్రమాణ స్వీకారం చేశారు. సుదీర్ఘ కాలంగా ప్రజా సమస్యలపై పోరాడుతున్న సూర్య, ఈ విజయంతో తన బాధ్యత మరింత పెరిగిందని భావిస్తూ, డివిజన్ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయనని స్పష్టం చేశారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ......41వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన ప్రథమ ప్రాధాన్యత అని, మౌలిక సదుపాయాల కల్పనలో వెనకడుగు వేయబోనని హామీ ఇచ్చారు. నాన్న మార్గంలో నడుస్తూ ప్రజలకు చేరువ అవుతానని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజల గొంతుకగా కౌన్సిల్‌లో సమస్యలను వినిపిస్తానని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిరంతరం ప్రజల చెంతనే ఉంటానని ఆయన ఈ సందర్భంగా ఉద్ఘాటించారు. అనంతరం పార్టీ శ్రేణులు, అభిమానులు, డివిజన్ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని సూర్యకి ఘనస్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలియజేశారు.

# "మహాశివరాత్రి" ప్రతి ఒక్కరి జీవితాల్లో శుభ ఫలితాలు ఇవ్వాలి

**కార్పొరేటర్ హమీద్ పటేల్**





**కొండాపూర్,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ):** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొండాపూర్ డివిజన్‌లో భక్తి సందడి నెలకొంది.శ్రీరామ్ నగర్ కాలనీ ఏ-బ్లాక్, ప్రేమ్ నగర్ కాలనీ ఏ-బ్లాక్ ప్రాంతాల్లోని దేవాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు,అభిషేకాలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ హాజరై శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి హారతులు సమర్పించి ఆశీస్సులు కోరారు.అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా హమీద్ పటేల్ మాట్లాడుతూ మహా శివరాత్రి ప్రతి ఒక్కరి జీవితాల్లో శుభఫలితాలు నింపాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, శాంతి నెలకొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో జే. బలరాం యాదవ్, ఎల్లారెడ్డి, అశోక్, చెంగయ్య, ఉజ్జిని శ్రీనివాస్, చలపతి, నర్సింహా రెడ్డి, రమేష్ యాదవ్, శారద, ఉజ్జిని శ్రీరామ్, నరేందర్ రెడ్డి, నాగరాజు యాదవ్, రంగారెడ్డి, వెంకటేష్, అభి అక్షయ్, మొహ్మద్ వసీం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహా శివరాత్రి వేడుకలు



**మల్కాజిగిరి :ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకు ని ఆదివారం రాత్రి జరిగిన జాగారం వేడుకలలో జయగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ ఠాగూర్ అరుణ్ సింగ్ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పండ్లు పంపిణీ చేశారు.

# మూడు దశాబ్దాల నిరీక్షణకు "మహా" ఫలం!!

- అచంచల విశ్వాసం.. అజేయ విజయం ● మేయర్ పీఠం అధిరోహించిన స్వామి
- గురువు ఎమ్మెల్యే పాదాలకు ప్రణామం ● పదవీ స్వీకార వేళ ఉప్పొంగిన భావోద్వేగాలు





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 16 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం రాజకీయ చరిత్రలో ఒక అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. దాదాపు మూడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, కాంగ్రెస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన మహంకాళి స్వామి చివరకు మేయర్ పీఠాన్ని అధిరోహించారు. ఈ విజయం కేవలం ఒక వ్యక్తిది మాత్రమే కాదు, "ఒకే జెండా-ఒకే సిద్ధాంతం" అనే నినాదంతో దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న ఒక సామాన్య కార్యకర్త నిబద్ధతకు దక్కిన గౌరవం. మహంకాళి స్వామి మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న తరుణంలో నగరమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఈ విజయాన్ని ఒక మహా యజ్ఞంగా అభివర్ణించవచ్చు. దానికి దైవ ఆశీస్సులు తోడయ్యాయని స్థానికులు చర్చించుకుంటున్నారు. పదవీ స్వీకార అనంతరం స్వామి తన రాజకీయ గురువు, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కాళ్లకు మొక్కి భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టడం అక్కడ ఉన్న వారందరినీ కదిలించింది. ఒక సాధారణ స్థాయి నుండి నగర ప్రథమ పౌరుడి వరకు ఎదిగిన ఈ ప్రయాణంలో ఆయన పడిన కష్టం, ఎదుర్కొన్న సవాళ్లు వర్ణనాతీతం. రామగుండం కాంగ్రెస్ చరిత్రలో స్వామి పడిన శ్రమ స్వర్గలోకపు స్వామికే ఎరుక అన్నట్లుగా, ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన ఫలితమే నేడు ఈ మేయర్ పదవి. రాజీలేని పోరాటం, పార్టీ పట్ల విధేయత ఉంటే గుర్తింపు తప్పక లభిస్తుందని ఈ పరిణామం నిరూపించింది. రాజ్ ఠాకూర్ నాయకత్వంలో రామగుండం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఈ పదవి ఒక గొప్ప స్ఫూర్తినిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అరుదైన విజయం కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, కష్టపడే వారికి కాలం కలిసి వస్తుందనే నమ్మకాన్ని బలపరిచింది.

# కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ ఏకగ్రీవ ఎన్నిక

**మేయర్‌గా మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్‌గా**
**సిరిపురపు లలితా కుమారి ఎన్నిక**





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించబడింది. మున్సిపల్ సాధారణ ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్ల ప్రమాణ స్వీకారం మరియు మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల కార్యక్రమం నియమావళి ప్రకారం నిర్వహించబడింది. సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అధ్యక్షత వహించి,ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.మొత్తం 60 డివిజన్లకు గాను ఎన్నికైన కార్పొరేటర్లు ప్రమాణ స్వీకారం చేశారు. సీపీఐ పార్టీకి చెందిన 22 మంది, కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది, బీజేపీకి చెందిన 1 మంది, సీపీఎం పార్టీకి చెందిన 1 మంది, స్వతంత్రంగా గెలుపొందిన 6 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన 8 మంది కార్పొరేటర్లు గైర్హాజరయ్యారు.అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నికల ప్రక్రియ నిర్వహించబడింది. 20వ డివిజన్‌కు చెందిన సీపీఐ కార్పొరేటర్ మూడ్ గణేష్ మేయర్‌గా, 8వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ కార్పొరేటర్ సిరిపురపు లలితా కుమారి డిప్యూటీ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఎక్స్-అఫీషియో సభ్యులుగా సమావేశానికి హాజరైన స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి తమ ఓటు హక్కును వినియోగించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో సమాన అభివృద్ధి సాధించేందుకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పట్టణంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా పారదర్శక, బాధ్యతాయుత పాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఎక్స్-అఫీషియో సభ్యులు నూతనంగా ఎన్నికైన మేయర్, డిప్యూటీ మేయర్,కార్పొరేటర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్పొరేషన్ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు అమోయ్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన ఐడీఓసి కార్యాలయం నుండి వెబ్‌కాస్టింగ్ ద్వారా ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# అలియాబాద్ మున్సిపాలిటీపై ఎగిరిన కాంగ్రెస్ జెండా: కొలన్ హన్మంత్ రెడ్డి వ్యూహం ఫలితం!

● మాజీ మంత్రి, ఎమ్మెల్యేల ప్రయత్నాలు విఫలం.. హస్తగతమైన మున్సిపాలిటీ. ● చైర్మన్‌గా 'కంటం శిరీష కృష్ణ రెడ్డి' ఎన్నిక.. శుభాకాంక్షలు తెలిపిన హన్మంత్ రెడ్డి. ● జిల్లా రాజకీయాల్లో పెరిగిన కాంగ్రెస్ ఆధిపత్యం.. శ్రేణుల్లో మిన్నంటిన సంబరాలు.

**మేడ్చల్/కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 16, (వార్తాప్రభ) :** మేడ్చల్ జిల్లా రాజకీయాల్లో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. అలియాబాద్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిపత్యాన్ని చాటుకుంది. ప్రతిపక్ష పార్టీకి చెందిన మాజీ మంత్రి మరియు ప్రస్తుత ఎమ్మెల్యేలు మున్సిపాలిటీని కాపాడుకోవాలని చేసిన అన్ని ప్రయత్నాలు ఫలించలేదు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అలియాబాద్ మున్సిపాలిటీ ఇంచార్జిగా వ్యవహరించి, అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించడంతో కాంగ్రెస్ పార్టీ విజయం సునాయాసమైంది.

**నూతన చైర్మన్‌గా శిరీష కృష్ణ రెడ్డి** మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన కంటం శిరీష కృష్ణ రెడ్డి మరియు గెలుపొందిన కౌన్సిలర్లను కొలన్ హన్మంత్ రెడ్డి శాలువాలతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అలియాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మైసిగారి శ్రీనివాస్, కొలన్ జీవన్ రెడ్డి మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.



# ప్రజావాణిలో వచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోండి

**అధికారులకు జోనల్ కమిషనర్ ఆదేశం**



**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి జోన్ పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 24 వినతులు అందాయి.జోనల్ కార్యాలయం సహా శేరిలింగంపల్లి,నర్సింగ్,మియాపూర్,అమెన్పూర్ సర్కిల్ కార్యాలయాల్లో అధికారులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.వివరాల ప్రకారం జోనల్ కార్యాలయంలో 5,శేరిలింగంపల్లి సర్కిల్‌లో 8,నర్సింగ్‌లో 3,మియాపూర్‌లో 5,అమెన్పూర్‌లో 3 వినతులు నమోదయ్యాయి.పట్టణ ప్రణాళిక, పన్నుల శాఖ,ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన సమస్యలే అధికంగా వచ్చినట్లు తెలిసింది.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.క్షేత్రస్థాయి పరిశీలనలు చేపట్టి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించి, తీసుకున్న చర్యలపై సంబంధిత ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# కొత్తగూడెం మేయర్‌గా ప్రమాణస్వీకారం చేసిన మూడ్ గణేష్

**సీపీఐ ఖాతాలో మేయర్ పీఠం**
**కీర్తిశేషులు ఎమ్మెల్యే రజబ్ అలీ ఇలాక**
**సుజాతనగర్లో పూర్వ వైభవం**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజాతనగర్,.కాంగ్రెస్--సీపీఐ పొత్తులో భాగంగా మేయర్ పదవి సీపీఐకి కేటాయింపు మేయర్‌గా సీపీఐ నేత మూడ్ గణేష్ పేరు అధికారికంగా ఖరారుమున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులుకాంగ్రెస్ నుంచి డిప్యూటీ మేయర్ ఎంపికకు కసరత్తు పూర్తికొత్త కార్పొరేషన్‌లో తొలి మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన మూడు గణేష్ కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠం సీపీఐ ఖాతాలోకి వెళ్లింది. కాంగ్రెస్--సీపీఐ పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించిన మేయర్ పదవికి ఆ పార్టీ సీనియర్ నాయకుడు మూడ్ గణేష్ పేరును అధికారికంగా ఖరారు చేశారు. దీంతో కొత్తగూడెం కార్పొరేషన్ తొలి మేయర్‌గా మూడ్ గణేష్ బాధ్యతలు చేపట్టారు. ఫిబ్రవరి 13న వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్--సీపీఐ కూటమి ఆధిక్యం సాధించింది. ఎన్నికల ముందు కుదిరిన ఒప్పందం ప్రకారం మేయర్ పదవిని సీపీఐకి కేటాయించారు. ఈ నేపథ్యంలో పార్టీ నాయకత్వం మూడ్ గణేష్ పేరును ఖరారు చేసింది. ఆయన అనుభవం, సమన్వయ నాయకత్వం, చిన్న వయసులోనే మేయర్ పీఠం ప్రజలలో ఉన్న మంచి పేరు కారణంగా కీర్తిశేషులు ఎమ్మెల్యే రజబ్ అలీ ఇలాక సుజాతనగర్లో పూర్వ వైభవం వస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కునంలేని, సాంబశివరావు కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా కి సుజాతనగర్ మండల సిపిఐ పార్టీ నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు

# ప్రజల మనిషికి పట్టాభిషేకం!!

- ప్రజా సేవకుడిగా సాగి సంతోష్ కుమార్ ప్రస్థానం
- 49వ డివిజన్ కార్పొరేటర్‌గా ప్రమాణ స్వీకారం
- పద్మావతి కాలనీ నమ్మకమే నా ఊపిరి
- అభివృద్ధే ధ్యేయం..ప్రజా క్షేత్రంలోనే పయనం



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 16 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగరంలోని 49వ డివిజన్ రాజకీయ ముఖచిత్రంపై సాగి సంతోష్ కుమార్ ఒక నూతన అధ్యాయాన్ని లిఖించారు. ప్రజా సేవయే పరమావధిగా సాగుతున్న ఆయన ప్రస్థానంలో నేడు కార్పొరేటర్‌గా ప్రమాణ స్వీకారం చేయడం ఒక మైలురాయిగా నిలిచింది. పద్మావతి కాలనీ వాసుల అచంచలమైన నమ్మకమే తన ఊపిరిగా భావిస్తున్న సంతోష్ కుమార్, ఈ విజయాన్ని ప్రజల విజయంగా అభివర్ణించారు. సామాన్య కార్యకర్త నుండి ప్రజా ప్రతినిధి స్థాయికి ఎదిగిన ఆయన ప్రయాణంలో నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టసుఖాలను పంచుకోవడమే ఆయన బలంగా మారింది. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయన మాట్లాడుతూ...... డివిజన్ సర్వతోముఖాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, మౌలిక సదుపాయాల కల్పనే తన ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. నాయకత్వం అంటే అధికారం కాదని, అది బాధ్యత అని చాటిచెప్తూ నిత్యం ప్రజా క్షేత్రంలోనే ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. పద్మావతి కాలనీ ప్రతి ఇంటికి సురక్షిత మంచినీరు, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, నాణ్యమైన రోడ్ల నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుతానని ఆయన దృఢ నిశ్చయం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీస్సులతో, అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ 49వ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్న ఆయన మాటలు స్థానిక ప్రజలలో కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయి.

# ఘనంగా ఎడ్ల కవిత జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి, ఫిబ్రవరి 16(వార్తా ప్రభ):** బాలనగర్ సీనియర్ బిఆర్ఎస్ నాయకురాలు ఎడ్ల కవిత జన్మదిన వేడుకలు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సోమవారం శేషాద్రి నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యే ఆశీర్వాదం తీసుకున్నారు అనంతరం ఎమ్మెల్యే ఎడ్ల కవితకు శాలువతో సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆ భగవంతుని కృపతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బొట్టు విష్ణు,శేకర్ నాయుడు,సందీప్ గౌడ్, రిషి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## బిల్ గేట్స్ వస్తే ఏంటి? సోషల్ మీడియాలో హాట్ టాపిక్

: టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ ఏపీ పర్యటనపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఒకప్పటి ప్రపంచ కుభేరుడైన బిల్ గేట్స్ రాకతో ఏపీకి ఏం ప్రయోజనమన్న ప్రశ్న ఎక్కువ చర్చకు దారితీస్తోంది. ఒక వ్యాపారవేత్త అయిన బిల్ గేట్స్ తన సొంత వ్యాపార ప్రయోజనాల కోసం రాష్ట్రానికి వచ్చారా? లేక ఇంకేమైనా విశేషం ఉందా? అనే అంశమే ఇప్పుడు హాట్ టాపిక్ గా నడుస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ లో అతిపెద్ద హైపర్ స్కేల్ డాటా సెంటర్ ను మైక్రోసాఫ్ట్ నిర్మిస్తోంది. ఇది ఈ ఏడాదే ప్రారంభం కానుంది. ఇలాంటి పరిస్థితుల్లో మైక్రోసాఫ్ట్ ఏపీలో ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు నిర్వహణకు ముందుకొస్తుంది అన్న చర్చ ఆసక్తి రేపుతోంది. వాస్తవానికి బిల్ గేట్స్ ప్రస్తుత పర్యటనలో మైక్రోసాఫ్ట్ వ్యాపారాల కంటే ఎక్కువగా సామాజిక ప్రాజెక్టులపై ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు వచ్చారని అంటున్నారు. బిల్ గేట్స్ కేవలం ఒక వ్యాపారవేత్తగానే కాకుండా, తన ఫౌండేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య, సామాజిక మార్పులకు కృషి చేస్తున్నారు. ఆయన ఏపీ పర్యటన రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడమే కాకుండా, సాధారణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం ఆశిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో బిల్ గేట్స్ కు మూడు దశాబ్దాల పరిచయం ఉంది. తొలిసారి 1997లో ఈ ఇద్దరు కలుసుకున్న తర్వాత ఉమ్మడి ఏపీలో ఐటీ పరిశ్రమ విస్తరణకు బీజం పడింది. ఇక ప్రస్తుతం పర్యటన ద్వారా బిల్ గేట్స్ వ్యాపార అంశాలు కంటే ఎక్కువగా సామాజిక అంశాలకే ప్రాధాన్యమిస్తున్నారని చెబుతున్నారు. ఏపీలో 'సంజీవని' అనే డిజిటల్ హెల్త్ ప్రాజెక్టును బిల్ గేట్స్ విస్తరించనున్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు అవుతున్న 'సంజీవని' విజయవంతమైంది. దీని స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ హెల్త్ రికార్డుల సిస్టం విస్తరించే విషయమై ప్రభుత్వంతో బిల్ గేట్స్ చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, బిల్ గేట్స్ మధ్య ఉన్న అనుబంధం కేవలం రాజకీయ లేదా వ్యాపార సంబంధం మాత్రమే కాదని తాజా భేటీ రుజువు చేస్తోంది. ఈ ఇద్దరి మధ్య స్నేహం మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఒక సాంకేతిక భాగస్వామ్యంగా అభివర్ణిస్తున్నారు. మరోవైపు అమరావతిలో ప్రతిపాదిత క్వాంటం వ్యాలీ, ఇతర ఐటీ ప్రాజెక్టులలో మైక్రోసాఫ్ట్ దాని అనుబంధ సంస్థల పెట్టుబడులపై ఆశలు రేకెత్తుతున్నాయి. బిల్ గేట్స్ వంటి ప్రపంచ స్థాయి వ్యక్తి రాజధాని అమరావతిని సందర్శించడం వల్ల ఇతర గ్లోబల్ కంపెనీలకు ఏపీపై నమ్మకాన్ని కలిగించే అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి. అదేవిధంగా రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పాలనలో అత్యాధునిక సాంకేతికతను ఏపీ ప్రభుత్వం వాడుకుంటోంది. ఈ నేపథ్యంలో డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవడంలో ఏపీ చేస్తున్న కృషికి గేట్స్ ఫౌండేషన్ సాంకేతిక సహాయం అందిస్తే, పాలనలో మరింత పారదర్శకత, వేగం పెరుగుతాయని అంటున్నారు ఇక ఈ రోజు అమరావతిలో జరుగుతున్న చర్చలు ఈ పాత అనుబంధానికి కొనసాగింపుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఒక వైద్య రంగంలోనే కాకుండా వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి తెచ్చి సాగుఖర్చులు తగ్గించడం, దిగుబడి పెంచేందుకు గేట్స్ ఫౌండేషన్ సహకారం అందించనుంది. ఇదే సమయంలో అమరావతిలో ప్రతిపాదిత క్వాంటం వ్యాలీ, ఇతర ఐటీ ప్రాజెక్టులలో మైక్రోసాఫ్ట్, దాని అనుబంధ సంస్థల పెట్టుబడులపై ఆశలు రేకెత్తుతున్నాయి. బిల్ గేట్స్ వంటి ప్రపంచ స్థాయి వ్యక్తి అమరావతి సందర్శన ఇతర గ్లోబల్ కంపెనీలకు ఏపీపై నమ్మకాన్ని కలిగిస్తుందని చెబుతున్నారు. సాగులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ల వినియోగాన్ని విస్తరించి రైతులకు లాభదాయకమైన విధానాలు అమలు చేసే దిశగా గేట్స్ ఫౌండేషన్ సహకరించనుందని అంటున్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం లభిస్తే, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను వేగంగా చేరుకోవచ్చు అని కూడా ఆశిస్తున్నారు

## నాగుల్ మీరా ఆశీస్సులతో టిడిపి అభివృద్ధికి కృషి చేస్తా

**తెలుగుదేశం ఎన్టీఆర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పేరాబత్తుల రమణ**



**విజయవాడ పశ్చిమ, ఫిబ్రవరి 16: (వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా ఆశీస్సులతో తెలుగుదేశం పార్టీ అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలుగుదేశం ఎన్టీఆర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పేరాబత్తుల రమణ చెప్పారు. ఆదివారం నాగుల్ మీరా చేతుల మీదుగా ఆయన టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా తన నియామకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పేరాబత్తుల రమణ మాట్లాడుతూ విజయవాడ ఎంపీ కేసినేని శివనాద్, నాగుల్ మీరా, గద్దె అనురాధ నాయకత్వంలో తాను విజయవాడ నగరంలో, ఎన్టీఆర్ జిల్లాలో తెలుగుదేశం పార్టీ అభ్యున్నతి కోసం తన శాయశక్తుల పనిచేస్తానని చెప్పారు. విజయవాడ నగర అభివృద్ధి కోసం ఎంపీ కేశినేని శివనాద్, నాగుల్ మీరా చేస్తున్న కృషిలో తాము కూడా భాగస్వాములు అవుతామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నాగుల్ మీరాను పేరాబత్తుల రమణ తదితర తెలుగుదేశం నాయకులు శాలువాతో సత్కరించి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ శనీశ్వర స్వామి వారి దేవస్థానం చైర్మన్ గణపా రామారావు, 48వ డివిజన్ తెలుగుదేశం నాయకులు చొక్కర అప్పారావు, తమ్మిన లక్ష్మీ నాయుడు, మాగం రమేష్, పొన్నాడ రాము, ఎస్.కె. సుభాని, ఎస్ కె. సలీం, రాయన రాజా, వడ్డాది చిన్నా, పొట్నూరి జోగేష్, పెళ్లూరి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిల్ గెట్స్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించిన పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు







**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం నందు సోమవారం కార్యక్రమానికి విచ్చేసిన గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీ బిల్ గెట్స్ ని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ లక్ష్మి శా , డి.సి.పి.లు కృష్ణ కాంత్ పటేల్ , శ్రీమతి షిరిన్ బేగం లు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాలు అందించారు.

### అసంఘటిత రంగ కార్మికుల హక్కులు, సంక్షేమానికి ఎనలేని కృషి చేసిన నాయకుడు

## కార్మిక నాయకుడు కామ్రేడ్ శీరం దుర్గారావు





**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సిపిఐ నగర మాజీ కార్యవర్గ సభ్యులు, ప్రముఖ కార్మిక నేత, అమరజీవి కామ్రేడ్ శీరం దుర్గారావు 10వ వర్ధంతి కార్యక్రమం సిపిఐ 49వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రావిచెట్టు సెంటర్లో డివిజన్ కార్యదర్శి బోర రామకృష్ణ స్వాగతం పలుకగా డివిజన్ సహాయ కార్యదర్శి కంచర్ల భార్గవ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. తొలుత సిపిఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు దుర్గారావు చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు వెల్లంపల్లి శ్రీనివాస్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి లు పాల్గొన్నారు. ఈ సందర్భముగా నాయకులు మాట్లాడుతూ శీరం దుర్గారావు తన జీవిత చరమాంకం వరకు కార్మిక నాయకునిగా కార్మికుల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం అయన చేసిన కృషి చిరస్మరణీయం ముఖ్యంగా తన జీవితాంతం రిక్షా వర్కర్స్, వీధివిక్రయదారుల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ నిరంతరం పోరాటాలు చేస్తూ ప్రభుత్వం మరియు అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లటం ద్వారా వారి సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేశారన్నారు, అదేవిధంగా కార్మిక నాయకునిగానే కాకుండా నిరంతరం స్థానిక ప్రజాలతో మమేకం అవుతూ స్థానిక సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పాటుపడిన మహోన్నత వ్యక్తి కామ్రేడ్ దుర్గారావు అన్నారు. ఆయన మరణించి 10 సంవత్సరాలు గడచిన నేటికీ రాజకీయాలకు అతీతంగా అయన స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం అయన చూపిన నిబద్దత నేటి యువతకు స్ఫూర్తి అని అన్నారు. అనంతరం 49వ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి. వందలాది మంది పేదలకు, స్థానికులకు నాయకులు స్వయంగా భోజనాలు వడ్డించారు. ప్రజల సేవలోనే పరమార్థం ఉందని నమ్మిన దుర్గారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అతిథులు పేర్కొన్నారు.

?ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, నగర కార్యవర్గ సభ్యులు సింగరాజు సాంబశివరావు, లంకా గోవిందరాజులు, ఏఐటీయూసీ నాయకులు కె.ఆర్.ఆంజనేయులు, బెవర శ్రీనివాసరావు, నగర పార్టీ నాయకులు పగిడికత్తుల రాము, ఆకుల యేసు, కోరంగి చిన్నారావు, నగర యువజన సమాఖ్య నాయకులు శీరం రవి, సింగంశెట్టి మోహనప్రసాద్, వెంకి, షైనీ, రాంబాబు, బంక చాముండేశ్వరి, వైసిపి నాయకులు శీరం వెంకట్రావు, సన్నికుమార్, జగ్గు సూరిబాబు, స్థానిక నాయకులు పిట్ట అప్పారావు గుజ్జారీ అప్పారావు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీ విజయ దుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాలు రెండవ రోజు స్వామివారి కి వేకువ జాము నుండి , ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి, చింతలపాటి పవన్ కుమార్ శర్మ తెలిపారు, శనివారం మిల్క్ ప్రాజెక్ట్ భీముని వారి పేటలో వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో శివరాత్రి రెండవ రోజు స్వామి వారికి 11 ద్రవ్యాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం అభిషేక కార్యక్రమం సాయంత్రము 8:00 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగాయనీ అనంతరం రాత్రి 12:00 గంటలకు లింగోద్భా సమయంలో 11 ద్రవ్యముతో అభిషేకము బస్మాభిషేకము (విభూదితో) నిర్వహించామని ఈ సందర్భంగా వారు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో స్వామివారి అన్న



ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రము గంటలకు జరిగిన స్వామివారి అమ్మవారి పవళింప సేవా కార్యక్రమములో యావన్మంది భక్తులు కార్యక్రమాలకు విచ్చేసి స్వామి వారి కృపాకటాక్షాలను పొందారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమం ఆలయ కమిటీ వారి పరిరక్షణలో నిర్వహించారు.

## ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో ఎల్వోసీ అందచేత..

**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 53 వ డివిజన్ కు చెందిన 21 ఏళ్ల సయ్యద్ సఫియా అనే మహిళ కాన్సర్ తో బాధపడుతోంది.. ఆమె వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ను సంప్రదించారు.. సమస్యను ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టి తీసుకెళ్లగా ఆయన వైద్యానికి అవసరమైన 9లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ కోసం లేఖను రాసారు.. దీనికి సంబంధించిన ఎల్వోసీ పత్రాలను బాధితురాలి కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే సుజనా చౌదరి కు కృతజ్ఞతలు తెలిపారు.. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, జనసేన నాయకుడు తిరుపతి సురేష్.. స్థానిక కూటమి నాయకులు , సుజనా మిత్ర లు పాల్గొన్నారు..



## మన నగరం -మన ఇల్లు తో సమానం

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మన నగరం -మన ఇల్లు తో సమానం అని, నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా మహాత్మా గాంధీ రోడ్, వన్ టౌన్, ప్రకాశం బ్యారేజ్, భవాని ఘాట్, కృష్ణవేణి ఘాట్, ఏలూరు రోడ్, పటమట ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు.నగరాన్ని పరిశుభ్రంగా, అందంగా ఉంచడం వలన ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ప్రతిరోజు రహదారులలో క్రమ తప్పకుండా పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా నిర్వహించాలని, డ్రైన్ లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, కాలుష్య రహితంగా ఉంచేందుకు ప్రతిరోజు డివైడర్ల లో, రోడకు ఇరువైపులా ఉన్న మొక్కలకు నీరు పోసి వాటిని హరితంగా ఉంచేటట్టు చర్యలు తీసుకోవాలని, మన ఇంటిని పరిశుభ్రంగా ఎలా చూసుకుంటామో విజయవాడ నగరాన్ని కూడా మన ఇల్లు గా భావించి ప్రతిరోజు పరిశుభ్రంగా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కే అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, సిబ్బంది, పాల్గొన్నారు

## పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం మసీదులు వద్ద పారిశుధ్యం నీరు విద్యుత్ సదుపాయాలుకల్పించాలి

**వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి బాజీ బాబా**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర వినతి పత్రం అందించిన బాజీ బాబా రంజాన్ మాసం ప్రారంభ సందర్భంగా 18 లేదా 19 తేదీలు చంద్ర మాసం దర్శనం ఆధారంగా పవిత్రరంజాన్.నెలప్రారంభమయ్యే నేపథ్యంలో విజయవాడనగరంలోప్రతిమసీదులోఐదువూటలనవాజు తరావీలునిర్వహించబడతాయిసేహరి ఇఫ్తారీ కిప్రజలు రాకపోకలుఎక్కువగాఉంటాయి మసీదుల దగ్గర పారిశుద్ధ్యం శుభ్రత భద్రత నిరంతరం విద్యుత్ సరఫరా జాగారం పండగ రోజున కబరస్తాలు శుభ్రత విద్యుత్ దీపాల అలంకరణ ఒంటిఅంశాలలో ఎటువంటి లోపములేకుండానగరపాలక సంస్థ కమిషనర్ కి విద్యుత్ శాఖ వారికి పోలీస్ శాఖ వారికి సమ్యనంతో పనిచేయాలని సదుపాయాలన్నీ ఏర్పాటు చేయాలని మరీ ముఖ్యంగా పశ్చిమ నియోజకవర్గము పంజా సెంటర్లో నైజాం గేట్ సెంటర్లలో మసీదులకు వెళ్ళు వారికి ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్.అంతరాయం లేకుండా ట్రాఫిక్ పోలీసు వారిని ఏర్పాటుచేయాలనిమంచినీళు రోడ్లుపారిశుద్ధ్యం అన్ని ఏర్పాట్లు చేయాలని నగరపాలక సంస్థకమిషనర్ కి రాష్ట్ర వైసీపీ కార్యదర్శి బాజీ బాబా వినతి పత్రం అందించారు.

## అధికారుల నిరంతర పర్యవేక్షణతో ప్రజలకు ఎటువంటి సమస్య తలెత్తనివ్వకూడదు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అధికారుల నిరంతర పర్యవేక్షణతో ప్రజలకు ఎటువంటి సమస్య తలెత్తనివ్వకూడదని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్ లో నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర, శాఖాధిపతులతో మాట్లాడుతూ అధికారులు ఎప్పటికప్పుడు సిబ్బంది ని పర్యవేక్షిస్తుండాలని, ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తనివ్వకుండా చూడాలని, ఒకవేళ ప్రజలకు ఎటువంటి సమస్య తలెత్తినచో వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 19 ఫిర్యాదులు స్వీకరించగా, అందులో పట్టణ ప్రణాళిక 12, ప్రజారోగ్యం 2, ఇంజనీరింగ్ 2, రెవెన్యూ 2, ఎస్టేట్ 1 ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జనరల్ ఎ. రవీంద్రరావు, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యా రంగంలో పాటుగా విద్యేతర రంగాల్లోనూ రాణించాలి



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జీవితంలో ఎదగడానికి విద్యారంగంతో పాటు క్రీడలు, సాంస్కృతిక తదితర రంగాల్లో కూడా రాణించడం అత్యంత ఆవశ్యకమని అమరావతి బాలోత్సవం సాంస్కృతిక విభాగ కన్వీనర్ జి వి రంగారెడ్డి ఉద్ఘాటించారు. బాలోత్సవంలో పాల్గొన్న రవీంద్ర భారతి నున్న స్కూల్ విద్యార్థులకు బహుమతి ప్రదానం, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో సోమవారం సాయంత్రం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటూ బాలోత్సవంలో కల్చరల్, అకడమిక్ విభాగాల్లో ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా విద్యార్థుల్ని ప్రోత్సహించిన, వారిని తీర్చిదిద్దిన స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టాఫ్ సరళ, సబీనా, రాహుల్, స్రవంతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యౌషధం చిరునవ్వు



పదిమందిని నవ్విస్తూ
మందహాసము గావిస్తూ
జీవితాన్ని ఆస్వాదించు
ఖేదాన్ని తరిమేస్తూ
నవ్వడం బహుమానము
నవ్వించడం ఘన కార్యము
తెలుసుకో ఈ సత్యము
పాటించు అనునిత్యము
నవ్వులేని వదనాలు
ప్రేమలేని హృదయాలు
కొరగానివి చూడగా
పిల్లలు లేని సదనాలు
చిరునవ్వుల కోటలోన
ఆ చక్కని తోటలోన
జీవించు నిరంతరము
పొందుకొనుము ఆరోగ్యము

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు, ఎమ్మిగనూరు,సెల్:9966414580

# అధికారులకు వినతి పత్రం అందించిన భారతీయ జనతా పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు శ్రీరామ్

**మచిలీపట్నం ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సోమవారం మీకోసం స్పందన కార్యక్రమంలో జనతా వారధి ద్వారా ప్రజల తరఫున గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీ పేరుతో ప్రతి పేదవాడికి సెంటు భూమి, ఇల్లు అనే పథకంలో జరిగినటువంటి అవకతవకలు , అనధికారిక వసూళ్ల గురించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకొని లబ్ధిదారులకు న్యాయం చేయాలి బిజెపి కృష్ణాజిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ మీకోసం కార్యక్రమంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. జగనన్న ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టుకొనుటకు అధికారులు సహకరించవలసిందిగా వినతి పత్రం అందించారు. రాష్ట్రంలో రైతులకు సంబంధించినటువంటి భూమి యొక్క కొత్త పాసు పుస్తకాల వ్యవహారంలో జరుగుతున్న జాప్యము ను, అక్రమ వసూళ్ల గురించి, అలాగే రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చే నోషనల్ ఖాతా నంబర్ బదులుగా



శాశ్వత ఖాతా నెంబర్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాస్ బుక్ కూడా ఆర్ ఓ ఆర్ వన్ బి , అడంగల్ తరహాలో ఆన్లైన్లో డౌన్లోడ్ చేసుకునే విధంగా అవకాశం కల్పించి పాసు పుస్తకాల ముద్రణకు అయ్యే ఖర్చు తగ్గించి సమయం ఆదా చెయ్యాలని అన్నారు. సినిమా హాళ్ల నిర్వహణలో జరుగుతున్న లోపాల గురించి, మొత్తం మూడు వినతులు సమర్పించి తక్షణమే విచారణ చేపట్టి పరిష్కరించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కృష్ణాజిల్లా జనతా వారధి కన్వీనర్ సిద్ధార్థ , బిజెపి సీనియర్ నాయకులు పంతం వెంకట గజేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల రామాంజనేయులు, ట్రెజరర్ సుబ్బారావునాయుడు , సాలాది రామకృష్ణ , నరేంద్ర , చదలవాడ వీరేంద్ర , తదితరులు పాల్గొన్నారు.

## బిల్ గేట్స్ కు గుర్రపు డెక్క తో వస్తువుల తయారీ వివరించిన జిల్లా కలెక్టర్.



**మచిలీపట్నం ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీ బిల్ గేట్స్ కు గుర్రపు డెక్క (వాటర్ హ్యాసింత్) నారతో తయారుచేసిన హస్తకళా బుట్ట సంప్రదాయ కలంకారి శాలువాతో ఆత్మీయంగా స్వాగతంపలికి సత్కరించారు. గుర్రపు డెక్క నారతో తయారుచేసిన బుట్టను పరిశీలించిన వెంటనే బిల్ గేట్స్ ఆసక్తి వ్యక్తం చేస్తూ, దాని తయారీ విధానం, ఉత్పత్తి నేపథ్యం గురించి కలెక్టర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనికి ప్రతిగా కలెక్టర్ స్పందిస్తూ, కృష్ణా జిల్లాలో గుర్రపు డెక్క (వాటర్ హ్యాసింత్) విరివిగా లభిస్తుందని, ఆ సహజ వనరును సమర్థవంతంగా వినియోగిస్తూ స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి) మహిళలకు హస్తకళా ఉత్పత్తులు (హ్యాండీక్రాఫ్ట్) తయారీలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా వివిధ రకాల పర్యావరణ హిత కళాకృతులను తయారు చేయిస్తున్నామని వివరించారు. మచిలీపట్నం మండలం చిన్నాపురం గ్రామంలో డ్వాక్రా మహిళలతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి, వారి ద్వారా ఈ హస్తకళా ఉత్పత్తులను (హ్యాండీక్రాఫ్ట్స్) తయారు చేయించి, లేపాక్షి, టీటీడీ (టీటీడీ) ఇతర సంస్థలకు ఆర్డర్లు అందిస్తూ మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా, ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, మరింత మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. గుర్రపు డెక్క నారతో తయారుచేసిన హ్యాండీక్రాఫ్ట్స్ పై బిల్ గేట్స్ ఆసక్తి చూపడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ పరిణామం ద్వారా కృష్ణా జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

## మీకోసం" ఫిర్యాదు లకు చట్ట పరిధిలో పరిష్కారం పొందండి..

**అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి.నాయుడు.**




**మచిలీపట్నం ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల యొక్క సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనీ తలపెట్టిన "మీకోసం" కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి. నాయుడు నిర్వహించి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించారు. సోమవారం మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేయడానికి వచ్చే ఫిర్యాదుదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పటిష్ట చర్యలు చేశారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులకు పోలీస్ సిబ్బంది తమ చేయి అందించి నడిపించుకొని తీసుకు వచ్చారు. పోలీస్ కార్యాలయానికి వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్య యొక్క పూర్వాపరాలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులను సత్వరంగా పరిష్కరించ వలసిందిగా తగు ఆదేశాలను జారీ చేసారు. వాటి యొక్క తీవ్రత ఆధారంగా వెంటనే విచారణ జరిపించి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టమని అడిషనల్ ఎస్పీ తెలిపారు.

## గుళ్ళపల్లిలో మహా శివరాత్రి టిటిడి ధార్మిక కార్యక్రమాలు

**అలరించిన హరికథా కాలక్షేపం**



**చెరుకుపల్లి మండలం ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుళ్ళపల్లి గంగాభికా సమేత ఆనందీశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి ని పురస్కరించుకొని శ్రీమతి బెజ్జంకి నాగమణి భాగవతార్ బృందం చే శివపార్వతుల కళ్యాణం హరికథ కాలక్షేపణ కార్యక్రమం జరిగింది. కథా గానం శ్రోతలను అలరింపజేసింది. వైలెన్ వద్దంటి రామ్మోహన్ రావు, తబలా దుండి బాపిరెడ్డి సహకార వాయిద్యం అందించారు. ఆలయ కమిటీ వారి నిర్వహణలో ఉదయం అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు రుద్ర హోమం జరిగాయి లింగోద్భవ సమయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. జంపాని శ్రీనివాసరావు భక్తులకు పులిహోర ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త అన్న పొన్నపల్లి సత్యనారాయణ, గుర్రం వెంకటేశ్వరరావు, ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మరియు దేవస్థాన కమిటీ సభ్యులు, అర్చకులు ప్రయాగ రాంబాబు పాల్గొన్నారు.

# మాదిరి ప్రశ్న పత్రాలు పై ప్రత్యేక దృష్టి సారించండి

**చేజర్ల ఫిబ్రవరి 16 (వార్తాప్రభ)** త్వరలో జరగబోయే ఇంటర్ పరీక్షల్లో మాదిరి ప్రశ్నా పత్రాలపై దృష్టి సారించాలని చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ అభిప్రాయాలను వారి విద్యార్థులతో పంచుకున్నారు. పరీక్షలు అంటే భయం లేకుండా మానసిక ప్రశాంతతతో పరీక్షలకు హాజరుకావాలని వారు విద్యార్థులకు సూచించారు. చిన్న మార్కుల ప్రశ్నలు రాయడం వల్ల మంచి మార్కులు సాధించవచ్చని వారు తెలిపారు. సివిఆర్ అండ్ ఎస్ఆర్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఈ విధంగా వారి విద్యార్థులకు ఈ క్రింది విధంగా సలహాలు సూచనలు చేశారు.

**కష్టపడితేనే మంచి ఫలితాలు సాధ్యం.. గణిత అధ్యాపకులు ఎస్కే సందాని బాషా**



ఇంటర్ పరీక్షల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు గణితంలో త్రికోణమితి సరళరేఖలు అవధులు మరియు అవకలనం వంటి ముఖ్యమైన సారాంశాలపై దృష్టి సారిస్తే ఎక్కువ మార్కులు తెచ్చుకునేందుకు అవకాశం ఉంటుందని మొదటి సంవత్సరం గణితంలో మంచి మార్కులు సాధించడానికి ఒక మార్కు ప్రశ్నలపై విద్యార్థులు శ్రద్ధ పెట్టాలని వారు సూచించారు. అలాగే రెండవ సంవత్సరం గణితంలో ప్రశ్నలపై సాధన చేస్తే మంచి మార్కులు సాధించవచ్చని గతంలో జరిగిన మాదిరి ప్రశ్న పత్రాలను ఎక్కువగా సాధన చేయాలని సూచించారు..

**సాధన చేస్తే మెరుగైన ఫలితాలు... రసాయన శాస్త్రం అధ్యాపకురాలు కె.సాలమ్మ**



ఇంటర్ రసాయన శాస్త్రంలో ముఖ్యంగా రెండవ సంవత్సరంలో విద్యుత్ రసాయన శాస్త్రం పి బ్లాక్ మూలకాలు ఆర్గానిక్ కెమిస్ట్రీ లో వచ్చే విధంగా చూడాలని సూచించారు అధ్యాపకులు. ప్రథమ సంవత్సరంలో పరమాణు నిర్మాణం మూలకాల వర్గీకరణ రసాయన బంధం అంశాల మీద ఎక్కువ శ్రద్ధ పెట్టినట్లయితే ఎక్కువ మార్కులు సంపాదించుకోవచ్చు. అలాగే బోర్డు వారి పాత ప్రశ్న పత్రాలను సాధన చేసి మొదటి సంవత్సరం పరీక్షల్లో నూతనంగా ప్రవేశపెట్టిన ఒక్క మార్కు ప్రశ్నలు బాగా ఎక్కువ పర్సంటేజీ వచ్చేదానికి దోహదపడతాయని వీటి మీద ఎక్కువ సాధన చేసి మంచి మార్కులు తెచ్చుకోవచ్చని వారు పేర్కొన్నారు.

**చిన్న ప్రశ్నలపై దృష్టి సారించండి...ఫిజిక్స్ అధ్యాపకులు టి.శ్రీధర్**



ఇంటర్ భౌతిక శాస్త్రంలో ముఖ్యంగా రెండో సంవత్సరంలో విద్యుత్తు మరియు ఆధునిక భౌతిక శాస్త్రం అత్యధిక మార్పులు తీసుకొచ్చే తదితర ముఖ్యమైన సారాంశాలపై విద్యార్థులు శ్రద్ధ పెట్టాలి. అలాగే గతంలో ఇచ్చిన ప్రశ్న పత్రాలను ఒకటికి రెండు సార్లు సాధన చేయాలి. అలాగే ఫార్ములాలు వ్యాస రూప ప్రశ్నలు భౌతిక శాస్త్రంలో మంచి ఫలితాలు సాధించవచ్చు.

# టీడీపీ నేత మూల్పురి సాయి కళ్యాణిపై ఎఫ్ఐఆర్ కట్టాలి

**గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి.**



**గన్నవరం,ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్లెక్సీఫోటోను చెప్పులతో కొడుతూ, అసభ్యంగా బూతులు తిడుతూ దహనం చేసిన మూల్పూరు కళ్యాణి పై ఎఫ్ఐఆర్ కట్టించాలని జిల్లా పోలీస్ సూపర్డెంట్ కి వినతిపత్రం ఇచ్చినట్లు గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి తెలిపారు. తేదీ 31.01.2026 న తమ పార్టీ కి చెందిన మాజీ మంత్రి అంబటి రాంబాబు ఫోటో ఉన్నా ప్లెక్సీ నీ గన్నవరంలోను మరియు హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్డులు సెంటరులో బహిరంగంగా టిడిపి నాయకురాలు మూల్పురి సాయి కళ్యాణి నాయకత్వాన 50 మందికి పైగా టిడిపి పార్టీ వారు రాంబాబు ని అవమాన పరుస్తూ బూతులు తిడుతూ చెప్పులతో కొట్టారనీతెలిపారు. దిష్టి బొమ్మా తగలబెట్టారన్నారు. అవి అన్ని సోషల్ మీడియాలో వైరల్ అయినవనీ,ఒక వ్యక్తిపై ఏమైనా అభిప్రాయం ఉంటే బహిరంగ ప్రదేశంలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన చేయవచ్చు కానీ మూల్పూరు సాయి కళ్యాణి మాజీ మంత్రి అంబటి రాంబాబు నీ కుక్కతో పోల్చటం, అలాగే చంపివేయాలి అంటూ హేయామైన బూతులు తిడుతూ కించ పరచటం చట్టరీత్య నేరం అన్నారు. అదే రోజు గన్నవరం గ్రామ గాంధీ బొమ్మా సెంటర్లో మూల్పురి సాయి కళ్యాణి నాయకత్వాన ఇక్కడ కూడా 50 మందికి పైన అదే పద్ధతులో అంబటి రాంబాబు ప్లెక్సీ పోటోను చెప్పులతో కొట్టి దగ్దం చేశారన్నారు. వారి మీద పోలీసులు కేసులు పెట్టలేదనీ,కనుక ఆ రెండు చోట్ల కార్యక్రమంలో పాల్గొన్న అందరిపై కేసు రిజిస్టర్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. మూల్పురి సాయి కళ్యాణి పేరున గూగుల్ లో వైరల్ అవుతుందనీ,దానిని కూడా పోలీస్ వర్గాలు పరిశీలించాలని కోరారు. చట్టం అందరికి సమానమేనని వారు సూపర్డెంట్ కి తెలిపా అన్నారు. రెండు సంవత్సరాల క్రితం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తలపై రాళ్లతో కొట్టిన ఘటనపై మేము శాంతియుతంగా నిరసన తెలియ జేశం కానీ, అప్పటి పోలీసులు మా పార్టీకి చెందిన 12 మందిపై ఎఫ్ఐఆర్ నెంబర్ 145/2024 కట్టరన్నారు. దీనికి మేము కోర్టులు చుట్టూ వాయిదాలకు తిరుగుతున్నామన్నారు.. ఈ కేసు వలన తనకు పోలీసు వారు పాస్ పోర్ట్ రద్దు చేశారనీ,తన ప్రయాణం రద్దు అయినదన్నారు. చట్టం అందరికి సమానమే కనుక ఈ ఘటనలు చేసిన కూటమి టిడిపి వారిపై కేసులు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కట్టి కోర్టుకు పంపాలని విజ్ఞప్తి చేస్తున్నా అని జడ్పిటిసి ఎలిజిబెత్ రాణి తెలిపారు.

# వైభవంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16(వార్తా ప్రభ ప్రతినిధి):**మండల పరిధిలోని మూలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాల త్రిపుర సుందరి సమేత విరూపాక్షేశ్వరస్వామి వారి దేవస్థానంలో శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గుడి ధర్మకర్త వెంపరాల విమలేశ్వరావు,లలిత పద్మిని దంపతుల చేతుల మీదుగా కళ్యాణ మహోత్సవం జరిపించారు. శివరాత్రి పర్వదిన సందర్భంగా మధ్యాహ్నం రుద్రహోమం,సాయంత్రం ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అట్టహాసంగా కళ్యాణ మహోత్సవం జరిగింది. అనంతరం తలంబ్రాల మహోత్సవం, కుంభాభిషేకం జరగటంతో కళ్యాణ మహోత్సవం పూర్తనట్లు అర్చకులు తెలిపారు. గ్రామస్తులు కళ్యాణ మహోత్సవాన్ని భక్తి పారవశ్యంతో తిలకించారు. సోమవారం గ్రామోత్సవం ద్వారా గడపగడపకు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలు చేరతాయని, అనంతరం గ్రామం ప్రజలందరికీ గుడి కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడి కమిటీ చైర్మన్ గరికపాటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు రామయ్య, గుడి ప్రధాన అర్చకులు పవన్ కళ్యాణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సైన్స్ ప్రయోగాలపై జేవీవీ రాష్ట్ర స్థాయి వీడియో పోటీలు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 16 (వార్తా ప్రభ ప్రతినిధి):**గత నాలుగు సంవత్సరాల నుంచి సైన్స్ ప్రయోగాల వీడియో పోటీలను జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తుందని జేవీవీ ఎన్టీఆర్ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ మామిడి సీతారామారావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక కొండపల్లి పట్టణ కమిటీ సమావేశం స్థానిక మోహన రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ లో ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా వీడియో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీలు విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి, సైన్స్ సిద్ధాంతాలను మెరుగ్గా అర్థం చేసుకోవడానికి, చదువులో ఆత్మవిశ్వాసం పెరగడానికి తోడ్పడతాయన్నారు. ఇన్నోవేషన్ – టెక్నాలజీ, పర్యావరణం – వ్యవసాయ రంగం, అపోహలు – శాస్త్రీయ వివరణ వంటి ప్రయోగ అంశాలని వివరించారు. లో కాస్ట్ – నో కాస్ట్ లో చేసిన ప్రయోగాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. మార్చి 8 తేదీలోగా వీడియోలు పంపాలని కోరారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ముద్రించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు – 2026 కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎస్.నాగరాజు, ఎస్.వి.ఎస్.ఎస్.ప్రసాద్, ఎస్.కె.సర్దార్ సాహెబ్, బి.డేవిడ్ రాజు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఐలాపురం వెంకయ్యకు అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు



**విజయవాడ,ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహాశివరాత్రి పర్వదినాన కన్నుమూసిన ప్రముఖ రాజకీయవేత్త, మాజీ ఎమ్మెల్సీ, బీసీ ఉద్యమ నేత, అజాతశత్రువుగా పేరొందిన ఐలాపురం వెంకయ్య (96)కు సోమవారం సాయంత్రం ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత విజయవాడ సీతారాంపురంలోని ఆయన స్వగృహం నుంచి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అనుచరులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, వేలాదిమంది ప్రజల అశ్రు నయనాల మధ్య అంతిమయాత్ర ప్రారంభమైంది. ఐలాపురం వెంకయ్య సేవలను స్మరించుకుంటూ పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. దివంగత ఐలాపురం వెంకయ్య జర్నలిస్టు మిత్రులకు ఎంతో సన్నిహితులని సీనియర్ జర్నలిస్టులు నిమ్మరాజు చలపతిరావు, తాళ్లూరి అనిల్ కుమార్ తదితరులు గుర్తుచేసుకుంటూ తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అలాగే, ఆయన కుమారుడు, మిత్రులు, సమాచార శాఖ మాజీ కమిషనర్ ఐలాపురం రాజాను పరామర్శించి సానుభూతి తెలిపారు.

## దివంగత వాసిరెడ్డి శంకర భవానికి ఘన నివాళులర్పించిన ప్రముఖులు





**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 16( వార్త ప్రభ )** పెనుగంచిప్రోలు గ్రామంలోని కంఠమనేని ఫంక్షన్ హాల్ లో గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ప్రముఖ నాయకులు, శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్, శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి అధ్యక్షులు వాసిరెడ్డి బెనర్జీ సతీమణి దివంగత వాసిరెడ్డి శంకర భవానీ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, కేడిసిసి బ్యాంక్ జిల్లా చైర్మన్ నెట్టెం రఘు రామ్, ఎమ్మెల్యే శ్రీ రామ్ రాజగోపాల్ తాతయ్య, జనసేన జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయ భాను, వైసిపి జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ లు పాల్గొని శంకర భవాని చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆమె ఆత్మ కు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, మాజీ ఎంపిపి వేగినేటి గోపాల కృష్ణ మూర్తి, మాజీ జెడ్ పి టీ సి గజ్జి కృష్ణ మూర్తి, సోసైటీ అధ్యక్షులు కర్ల వెంకటరమణ, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుదీర్ బాబు, చుంచు రమేష్ బాబు,గ్రామ టీ డి పి అధ్యక్షులు కొత్త పల్లి సతీష్ కుమార్, తెలుగు యువత నాయకులు మాదినేని వెంక ట్రావ్, లగడపాటి ప్రవీణ్, నల్లపు నేని కొండ, నూతల పాటి వెంకట్, తాడిపుడి సత్యం, పెనుగంచిప్రోలు మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మాదల శ్రీనివాసరావు, ప్రెస్ క్లబ్ కన్వీనర్ బోళ్ల రవి కుమార్,జనసేన నాయకులు, మాజీ ఎంపిపి గుడపాటి శ్రీనివాసరరావు,నాయకులు నల్లపునేని వెంకటనారాయణ, గింజుపల్లి నరసింహారావు,మాదల వీరయ్య చౌదరి, తునికి పాటి శివా,గుంటుపల్లి వాసు, కాకాని పద్మ. వైసిపి నాయకులు తన్నీరు నాగేశ్వరరావు,వేల్పుల రవికుమార్, ఊట్ల నాగేశ్వరరావు,బత్తుల రామారావు, గుడిమెట్ల శంకర్, తదితరులు పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

## ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఖాళీ స్థలాల పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం సాయంత్రం ప్రధాన కార్యాలయంలో గల తమ చాంబర్లో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ), అసిస్టెంట్ కమిషనర్లు మరియు రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో పన్ను వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరాభివృద్ధికి పన్ను వసూళ్లు ఎంతో ముఖ్యమని, నగరపాలక సంస్థ పరిధిలోగల వివిధ పనులైన ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, డ్రైనేజ్ పన్ను, నీటి పన్ను అన్ని వసూలు చెయ్యాలని, నగరపాలక సంస్థకు ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్న ఖాళీ స్థలాల పన్ను నుంచి ఎక్కువగా రాబట్టాలని అందుకు ప్రత్యేక కృషి చెయ్యాలని అన్నారు. ప్రతిరోజు లక్ష్యం పెట్టుకొని ఆ లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, అసిస్టెంట్ కమిషనర్లు ఎ.యూ.బి. శర్మ, డి. ఎస్.ఎస్. శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## హోటల్ ఐలాపురం వెంకయ్య గారి అస్తమయం









ఈ వార్త గుండెను నెమ్మదిగా నొక్కినట్లైంది. మాటలన్నీ ఒక్క క్షణం మౌనమైపోయేలా చేసింది. అయినా శివరాత్రి వంటి మహా పర్వదినాన ఆత్మ అస్తమించిందనగానే, ఆ బాధలోనే ఒక అద్భుతమైన శాంతి కలిగింది. ఇది సాధారణ మరణం కాదు – ఇది ఒక ఔన్నత్యం గల పుణ్యాత్మ జీవనానికి వచ్చిన సహజ పరిపూర్ణ ముగింపు.హోటల్ ఐలాపురం వెంకయ్య గారు జీవించినంత కాలం బిసిలకు లైట్ హౌస్ లా వెలిగిన దీపం. ఆయన మాటల్లో ఆర్భాటం ఉండేది కాదు, కానీ అర్థం ఉండేది. ఆయన నడకలో గర్వం కాదు, గౌరవం ఉండేది. ఆయన మౌనంలో కూడా ఒక మార్గదర్శకత్వం ఉండేది. అందుకే ఆయన మరణమే ఆయన ఎంత గొప్పవారో నిరూపిస్తోంది.నాకు డాక్టరేట్ లభించిన రోజు– అది కేవలం వ్యక్తిగత విజయమే కాదు, ఒక జీవిత యాత్రకు గుర్తింపు. ఆ రోజు అభినందన సభకు ఆయన స్వయంగా మా కుటుంబ సభ్యుడిలా వచ్చి కూర్చోవడం, మాటలతో కాదు... చూపులతో, స్పర్శతో, ఆత్మీయతతో ఆశీర్వదించడం – అది జీవితాంతం మోసుకెళ్లే సంపద. పెద్దరికం అంటే ఏమిటో, హూందాతనం అంటే ఏమిటో, ఆ రోజు ఆయన నిలబడిన తీరే చెప్పింది.పిల్లలిద్దరినీ దగ్గరకు తీసుకుని,"మీ నాన్నగారిని స్ఫూర్తిగా తీసుకోండి... ఆయన కంటే గొప్ప స్థాయికి వెళ్లాలి,"అని ఆయన పలికిన మాటలు ఇప్పటికీ చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. అది సాధారణ ప్రోత్సాహం కాదు – ఒక తరం నుంచి మరో తరానికి అందించిన విలువల దీపం. ఆ మాటల్లో ఆశ ఉంది, బాధ్యత ఉంది, భవిష్యత్తు ఉంది.ఆయన రూపం నాకు ఎప్పుడూ ప్రకృతిలాగే అనిపిస్తుంది అతి శబ్దం లేని అడవి,చల్లని నీడనిచ్చే చెట్టు,నిశ్శబ్దంగా వర్షాన్ని ఆహ్వానించే భూమి.ఎవరికీ భారంగా కాకుండా, అందరికీ ఆసరాగా ఉండే సహజత్వం.శివరాత్రి నాడు ఆయన అస్తమించడం– అది అస్తమయం కాదు, లయ. లయలో కలిసిపోయిన జీవితం తిరిగి స్మృతిగా వెలుగుతుంది. ఆయన శరీరం మాయమైనా, ఆయన మాటలు, విలువలు, స్పర్శ – ఇవన్నీ మనతోనే ఉంటాయి. మనలోనే జీవిస్తాయి.ఈ విషాదంలో కూడా ఒక ధన్యత ఉంది.ఇలాంటి జీవితం, ఇలాంటి మరణం – రెండూ అరుదైన వరాలు.వారికి నా హృదయపూర్వక శ్రద్ధాంజలి.ఆ మహాత్ముని ఆత్మకు శివసాన్నిధ్యం చేకూరాలని ప్రార్థన.మాకు మిగిల్చిన జ్ఞాపకాలే ఆయన నిజమైన స్మారకం.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ

**డాక్టర్ ఎమ్మెస్వీ సత్యనారాయణ బాబు (కపర్ది)-గుడివాడ.**

(సభా వాగ్భూషణ, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్)

# జననేత కల సాకారం!!

● డిప్యూటీ మేయర్‌గా పాతిపెల్లి ఎల్లన్న ● నాడు మోసం.. నేడు న్యాయం ● ఎమ్మెల్యే అండ.. ఎల్లన్నకు కొండంత బలం ● ప్రజల కోసమే నా ప్రయాణం ● ప్రమాణ స్వీకారం తర్వాత ఎల్లన్న భావోద్వేగం





పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 16 (వార్తాప్రభ ప్రతినిధి) రాజకీయాల్లో సుదీర్ఘ కాలంగా నిబద్ధతతో పనిచేస్తున్న పాతిపెల్లి ఎల్లన్న కల ఎట్టకేలకు సాకారమైంది. ఆయన సోమవారం నగర డిప్యూటీ మేయంగా అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. గతంలో ఎంతోమంది నాయకులు ఆయనను నమ్మించి మోసం చేసినప్పటికీ, కాంగ్రెస్ పార్టీలో ఆయనకు తగిన గుర్తింపు దక్కడంతో ఎట్టకేలకు న్యాయం జరిగిందని అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అండదండలు, పూర్తి సహకారంతో ఈ ఉన్నత పదవిని దక్కించుకున్న ఎల్లన్న, తనపై నమ్మకం ఉంచిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పదవులు కేవలం అధికారం కోసం కాదని, ప్రజలకు సేవ చేసేందుకేనని చాటిచెబుతూ, రాబోయే రోజుల్లో నగర అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానని ఆయన ఈ సందర్భంగా ఘనంగా ప్రమాణం చేశారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానని, పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ఎన్నో ఆటంకాలను దాటుకుని ఈ స్థాయికి చేరుకున్న ఎల్లన్నకు ఆయన అనుచరులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తూ సంబరాలు జరుపుకుంటున్నారు.

## ప్రోత్సాహంగా మహిళా పారిశ్రామికవేత్తల "చేనేత హస్తకళ ఉత్పత్తుల" ప్రదర్శన

**అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు**








**శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ):**మహిళా సాధికారతకు ప్రోత్సాహంగా శిల్పారామం మాధాపూర్ లో మహిళా పారిశ్రామికవేత్తల చేనేత––హస్తకళ ఉత్పత్తుల ప్రదర్శన కొనసాగుతోంది.తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, సావిత్రిబాయి విమెన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళా సందర్శకులను ఆకట్టుకుంటోంది.బెల్లం మాధవి సమన్వయంతో మహిళా వ్యాపారవేత్తలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పద్మజ విశ్వాస్ నాయకత్వంలో లలిత సంగీతం, వయోలిన్, కీబోర్డ్ వాయిద్యాలు,కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి.

## భక్తిశ్రద్ధలతో 55వ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

● కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక పూజలు ● ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ● ఆధ్యాత్మికతతో పాటు క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం ● సూరారంలో ఉత్సాహంగా బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం







**కుత్బుల్లాపూర్/జీడిమెట్ల, ఫిబ్రవరి 16, (వార్తాప్రభ) :**కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న 55వ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక శోభతో మిన్నంటాయి. సోమవారం జరిగిన ఈ ఉత్సవాలకు మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పరమశివుడితో పాటు మల్లికార్జున స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ.. మల్లికార్జున స్వామి వారి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మరియు అర్చకులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

**క్రీడల్లో యువత రాణించాలి** అనంతరం సూరారం కట్ట మైసమ్మ వద్ద శివరాత్రి పర్వదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు లిగుంజె షణ్ముఖ సాయిలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లిబాక్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను లి శ్రీశైలం గౌడ్ గారు ప్రారంభించారు. పండుగ పూట భక్తితో పాటు యువతకు వినోదం, ఉత్సాహం అందించేలా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు

## కనులపండువగా శ్రీ వేంకటేశ్వరుని ఊంజల సేవ...



**గుడ్లవల్లేరు:ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భూ సమేత శ్రీ వేంకటేశ్వరాలయంలో స్వామివార్ల ఉత్సవ మూర్తులకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేద మంత్రోచ్చరణ నడుమ ఊంజల సేవను చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు తదితరులు ఉన్నారు.

## జిల్లా బాల్ బాడ్మింటన్ అసోషియేషన్ సెక్రెటరీగా శివశంకర్....



**గుడ్లవల్లేరు:ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)** జిల్లా బాల్ బాడ్మింటన్ అసోషియేషన్ సెక్రెటరీగా శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ పిజికల్ డైరెక్టర్ మత్తి శివశంకర్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను నాట్స్ మాజీ అధ్యక్షుడు గుత్తికొండ శ్రీనివాసరావు, శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, సాగునీటి డీసీ చైర్మన్ మల్లిపెద్ది సుబ్రహ్మణ్యం, పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లమూడి యుగంధర్, నాగయ్య, దేశపతి, మణికుమార్, రాంప్రసాద్, కష్ణప్రసాద్, లక్ష్మీనారాయణ దుశ్శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు.

## దుమ్ము - ధూళితో బతికేది...ఎలా?

**పరిష్కారం చూపాలని అరుణానగర్ కాలనీ వాసుల డిమాండ్ ...?**



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 16(వార్తా ప్రభ ప్రతినిధి కొండపల్లి మున్సిపాలిటీ 29వ వార్డు పరిధిలో అరుణానగర్ వాసులు రోడ్డుపై క్వారీ, క్రషర్ లారీల వలన దుమ్ము ధూళి ఉండటంతో మేము బతికేది ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల నుంచి నిరసనలు తెలియజేసిన పాలకులు పట్టించుకోవట్లేదని పరిష్కారం మార్గం చూపించడంలో విఫలం అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు.క్వారీ కషర్ లారీలు అరుణ నగర్ రోడ్లపై రాకుండా చర్యలు తీసుకోవడమే పరిష్కార మార్గమని ఆందోళనకు పూనుకున్నారు.నిరంతరం క్వారీ,క్రషర్, సిమెంట్ ఫ్యాక్టరీల లారీలు తిరగడంతో రోడ్లు గుంతలమయమై దుమ్ము దూళి తీవ్ర రూపం దాల్చి భోజనంలో దుమ్మును కలిపి తినే పరిస్థితికి వచ్చిందని అనారోగ్యాలు పాలై ఇబ్బందులు పడుతున్నామని పిల్లల స్కూల్ కి వెళ్ళాలంటే లోపలికి స్కూల్ బస్సులు, ఆటోలు రావట్లేదని,రాత్రులు చీకటి మాయం గా ఉండటంతో రాత్రి 7గంటలు దాటితే బిక్కు బిక్కు మని భయంతో మహిళలు వృద్ధులు బతకాల్సిన పరిస్థితి ఉందన్నారు.తక్షణమే ఎమ్మెల్యే,మున్సిపల్ చైర్మన్ స్పందించాలని కోరారు. సిపిఎంయు మండల కార్యదర్శి మహేష్ సంఘీభావం తెలిపారు.

## బాధ్యతాయుత పీఠంపై మౌనిక!!

**ప్రజా సేవయే పరమావధి**
**ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తా**
**4వ వార్డు కార్పోరేటర్ కంకణాల మౌనిక**



పెద్దపల్లి/ గోదావరిఖని: ఫిబ్రవరి 16 (వార్తాప్రభ ప్రతినిధి)రామగుండం నగరపాలక సంస్థ నాలుగవ డివిజన్ కార్పొరేటర్‌గా సోమవారం కంకణాల మౌనిక ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....తనపై నమ్మకంతో గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతూ, పదవిని బాధ్యతగా భావించి నిస్వార్థంగా ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ, స్థానిక సమస్యల పరిష్కారమే తన తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. తోటి కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ నగరాభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని చెబుతూ, నూతనంగా ఎన్నికైన సహచర కార్పొరేటర్లందరికీ ఆమె ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలియజేశారు. మౌనిక బాధ్యతలు స్వీకరించిన వేళ అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలుపగా, ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుని పోతూ ఆదర్శవంతమైన పాలన అందిస్తానని ఆమె ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

## నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీకి పెరుగుతున్న ఆదరణ

**కోట గ్రామంలో వైసీపీకి భారీ షాక్**
**మంత్రి సుభాష్ సమక్షంలో 50 మంది కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరిక**





కె గంగవరం: ఫిబ్రవరి 16 :(వార్తా ప్రభ ప్రతినిధి)డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం కె గంగవరం మండలం కోట గ్రామం శివారు రాజవైరిలో రాజకీయ పరిణామాలు వేగం పుంజుకున్నాయి. గ్రామానికి చెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో ఘనంగా చేరారు.పార్టీలో చేరిన వారందరికీ మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం పార్టీ కండువాలు వేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతాయని, ప్రజల నమ్మకానికి అనుగుణంగా పాలన కొనసాగుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఎక్కడా లేని విధంగా ప్రమాద బీమా అమలు చేస్తున్నామన్నారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకీ ఆదరణ పెరుగుతుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారంతా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మంత్రి సుభాష్ నాయకత్వంలో రామచంద్రపురం నియోజవర్గాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, మలకల విశ్వేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు మలకల రామచంద్రరావు, కాటే సుబ్రమణ్యం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తలపట్ల ఆనందరావు, నియోజవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, దంగేటి నాగేశ్వరరావు, జుత్తుక శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ చేరికలతో కోట గ్రామంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అయిందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు.తొలుత గ్రామంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిన ఆంధ్రప్రదేశ్ బడ్జెట్.

**టీడీపీ అధికార ప్రతినిధి నల్లమోలు వెంకట శివ రామ ప్రసాద్**



పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 16( వార్త ప్రభ ) రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తీర్చిదిద్దిన బడ్జెట్.ఇది రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని కూటమి ప్రభుత్వం సహసోపేతంగా తయారు చేసిన బడ్జెట్. ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ 2026–27 : రూ.3,32,205 కోట్లతో ఏపీ బడ్జెట్...ఏపీ ప్రభుత్వం భారీ అంచనాలతో 2026–27 వార్షిక బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వంలో సాగిన పాలన పైన విమర్శలు చేసారు. రాష్ట్ర విభజన ఒక నష్టం అయితే, ఆ తరువాత అయిదేళ్లు పాలన రాష్ట్రానికి నష్టం చేసిందని టిడిపి అధికార ప్రతినిధి నల్లమోలు వెంకట శివరాం ప్రసాద్ ఆరోపించారు. ఈ బడ్జెట్ కేవలం పద్దులే కాదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు.అభివృద్ధి– సంక్షేమంతో రాష్ట్రాన్ని పరుగులు పెటించాలనే దే తమ విధానమని స్పష్టం చేశారు....ఈ బడ్జెట్ మంత్రి పయ్యావుల ప్రతిపాదించే ప్రతి రూపాయి రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలను సాకారం చేసేందుకు ఉద్దేశించిందే అన్నారు. తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదు, అంకెలకు అతీతం రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలో పరుగులు పెట్టించాలనే సంకల్పం కూటమి ప్రభుత్వానిది అన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ.. క్రీడా మహోత్సవాలకు విశేష స్పందన






**గుడివాడ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలం గురజ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యందు రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో గత 2రోజుల నుండి జరుగుతున్న క్రీడా మహోత్సవాలు శనివారం జయప్రదంగా ముగిసాయి. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి మండలం జిల్లా పరిషత్తు పాఠశాలల ఉన్న బాలికలు సుమారు 800 మంది ఈ క్రీడా మహోత్సవంలో పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కైకలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, జయ మంగళ వెంకటరమణ లు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల పూర్వ విద్యార్థి యర్నేనేని కిరణ్ కుమార్ తల్లి గారు యర్నేనేని లలితాంబ గారికి సన్మానం చేయడం జరిగినది. పై ముగింపు కార్యక్రమంలో గుడివాడ రోటరీ ప్రెసిడెంట్ ఎలమంచిలి నాగేశ్వరరావు, సెక్రెటరీ గుళ్ళపల్లి కిరణ్ బాబు, ఎలమంచిలి లవిత్ర, బలుసు శంకర్రావు, ఆవుల మారుతి కుమార్, తుమ్మల శివాజీ కుటుంబరావు, అడుసుమిల్లి జనార్ధన ప్రసాద్, కొల్లి శ్రీనివాస్ మరియు తుమ్మల శ్రీనివాస్ చౌదరి గురజ పాఠశాల హెచ్ఎం మరియు ఆ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధ్య తరగతి యువతకు అందుబాటు ధరల్లో బజాజ్ పల్సర్ బైక్..

- వరుణ్ బజాజ్ నూతన పల్సర్ బైక్ ని ఆవిష్కరించిన జనసేన గుడివాడ ఇన్ఛార్జి బూరగడ్డ శ్రీకాంత్



**గుడివాడ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** సోమవారం ఉదయం స్థానిక కోతిబొమ్మ సెంటర్ నందు అలాగే యలవర్తి గ్రౌండ్స్ నందు వరుణ్ బజాజ్ బైక్ షోరూం వారు ఏర్పాటు చేసిన నూతన పల్సర్ బైక్ ఆవిష్కరణ మరియు సేల్స్ అండ్ సర్వీస్ గుడివాడ జనసేన ఇంచార్జి బూరగడ్డ శ్రీకాంత్ ప్రారంభించారు. అనంతరం కస్టమర్ కి బైక్స్ ని బూరగడ్డ శ్రీకాంత్ చేతుల మీదుగా డెలివరీ చేశారు. ఈ సందర్భంగా బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ బజాజ్ పల్సర్ బైక్ మధ్యతరగతి మరియు యువత ఎంతో ఇష్టపడతారు అని చెప్పారు. మన రోడ్లుకు అనువుగాతయారు చేయపడి వుంది నడుపుటకు బాగుంటుంది అని అన్నారు. అలాగే నాకు వ్యక్తిగతంగా నా జీవితం లో మొదటి వాహనం అని అనుభవాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమం లో బజాజ్ కంపెనీ డిజిఎం శ్రీనివాస్, గుడివాడ బజాజ్ షోరూం మేనేజర్ కిషోర్, గుడివాడ జనసేన పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి సాయన రాజేష్, సుధాబత్తుల వెంకటేష్, సాయిపవన్ మరియు సేల్స్ అండ్ సర్వీస్ సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం

- ముస్లిం మైనార్టీల సంక్షేమానికి 6,090 కోట్లు కేటాయించడం పట్ల హర్షాతిరేకాలు
- తెదేపా పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు



**నందిగామ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** రాష్ట్ర ముస్లిం మైనార్టీ సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తూ కూటమి ప్రభుత్వం బడ్జెట్లో 6,090 కోట్ల నిధులు కేటాయించి పెద్దపీట వేయటం మైనార్టీల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఇమాం జాని అన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ పట్టణ మైనార్టీ సెల్ కార్యాలయం నుండి విడుదల చేసిన ప్రకటనలో మూడో వార్డు ప్రెసిడెంట్ షేక్ హనీఫ్ తో కలిసి ఇమామ్ జానీ బడ్జెట్లో ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని తన హర్షాతిరేకలను తెలిపారు. ప్రస్తుత బడ్జెట్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం క్రింద 300 కోట్లు, స్వయం ఉపాధి అర్థిక భరోసా కు 183 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీల స్వయం ఉపాధి ఆర్థిక భరోసా కు 21 కోట్లు, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల భవనాల నిర్మాణాలకు 20 కోట్లు, హజ్ యాత్రికులకు లక్ష రూపాయల చొప్పున, ఇతరత్రా హజ్ యాత్ర కోసం హజ్ కమిటీకి 6.97 కోట్లు, వివిధ పరీక్షలకు, కోచింగ్ ఇచ్చేందుకు సి ఈ డి యం కు3.97 కోట్లు, ఉర్దూ అకాడమీకి7.83 కోట్లు, ఉర్దూ ఘర్ కం షాదీ ఖానాల నిర్మాణాలకు2.85 కోట్లు, ఇమామ్లు, మౌజన్ల గౌరవ వేతనాన్ని 90 కోట్ల రూపాయలతో పాటుగా ఇతర పథకాలకు కలిపి 6,090 కోట్ల రూపాయలను కేటాయించడం పట్ల తమ సంతోషాన్ని తెలిపారు. ప్రకటనలో తెలిపారు.ఇమామ్ లు, మోజన్లుకు గౌరవ వేతనాలను పెంచి ఇవ్వడం పట్ల వారు హతమహర్షిని వెలిబుచ్చారు.

# గుడివాడలో అత్యంత వైభవంగా మహాశివరాత్రి పర్వదిన వేడుకలు

- హర హర మహాదేవ నామస్మరణలతో మార్మోగిన శైవ క్షేత్రాలు..
- ఆలయాలకు వేలాదిగా పోటెత్తిన భక్తులు..










**గుడివాడ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** పట్టణంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. హర హర మహాదేవ నామ స్మరణలతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుండి స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. వేద పండితులు స్వామి వారికి విశేష అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో ప్రసిద్ధిగాంచిన బంటుమిల్లి రోడ్డు లోని శ్రీ భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదిన వేడుకలు వైభవంగా జరిగాయి. గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం దంపతులు, సీనియర్ టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ స్వామి వివేక సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాల నైవేద్యాన్ని ఆర్డీవో బాలసుబ్రమణ్యం భక్తులకు పంపిణీ చేశారు. కన్నుల పండుగగా జరుగుతున్న మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని ఆర్డీవో బాలసుబ్రమణ్యం అన్నారు. వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టగ, సచివాలయాల మెడికల్ సిబ్బంది ఆలయంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఉత్సవ వేడుకలను దేవస్థానం ఈవో కందుల గోపాలరావు, ధర్మకర్తల కమిటీ చైర్మన్ పట్టపు చిన్న, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

**శ్రీ గౌరీ శంకర స్వామి వారి దేవస్థానంలో.. :** గౌరీ శంకరపురంలోని శ్రీ గౌరీ శంకర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకల్లో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు తెల్లవారుజామునండి పెద్ద సంఖ్యలో భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవ్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సోమవారం ఉదయం మహా పూర్ణాహుతి కార్యక్రమం సాయంత్రం శ్రీ స్వామి అమ్మవార్ల గ్రామోత్సవ కార్యక్రమం మేళతాళములతో ఊరేగింపుగా గుడివాడ పట్టణ పురవీధుల యందు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ సుభాష్ సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు.

**శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు.. :** జై వాసవి వనిత విదర్భపురి గుడివాడ వారి అధ్వర్యంలో మహా శివరాత్రి సందర్భంగా 15 ఫిబ్రవరి 26 శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు సాయంత్రం 8 గంటలకు శివ కళ్యాణం సందర్భంగా క్లబ్బు వారీ చే ప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనిత విదర్భపురి గుడివాడ క్లబ్ ప్రెసిడెంట్ వేముల అనుసూయ.. వారీ బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు అలాగే ఈ కార్యక్రమంలో బొగ్గరపు పద్మ రావూరి పూర్ణిమ మండల్ రమణి మౌనిక మొదలగు వారు సహకరించారు ఈ కార్యక్రమంలో కొత్త జ్యోతి కుమారి దుడ్డు గజలక్ష్మి సురేఖ ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# బీసీలు అన్ని రంగాల్లో రాణించడం హర్షణీయం..

- ఆం.ప్ర. బీసీ సంఘం ఐక్యవేదిక అధ్యక్షుడు రావులకొల్లు..
- గుడివాడ నియోజకవర్గం బిసి ఐక్యవేదిక కృష్ణా జిల్లా బిసి ఓబీసీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రితిక ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ బెస్ట్ నంది అవార్డు గ్రహీతలకు సన్మాన సత్కారాలు..



**గుడివాడ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** బీసీలు అన్ని రంగాల్లో రాణించడం హర్షణీయమనీ ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంఘం ఐక్యవేదిక అధ్యక్షులు రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు అన్నారు. సోమవారం గుడివాడ నియోజకవర్గం బిసి ఐక్యవేదిక కృష్ణా జిల్లా బిసి ఓబీసీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గుడివాడ వెలమ సంఘం సంక్షేమ భవనం నందు స్వచ్ఛంద సంస్థ రితిక ఫౌండేషన్ బెస్ట్ నంది అవార్డు గ్రహీతలకు సన్మాన సత్కార కార్యక్రమాలు నిర్వహించారు. చింతలూరు సత్యనారాయణ, ఆర్ వి ఎల్ నరసింహారావు, వంగివరపు నవీన్, రెడ్డి శ్రీనివాసరావు, గోదా రవిబాబు ఏజీపీ రెడ్డి బంగారయ్య సీనియర్ పాత్రికేయులు బందారు రాధాకృష్ణ లను బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వారి కుటుంబ సభ్యులు, మిత్రులు సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రావులకొల్లు మాట్లాడుతూ బీసీలు చైతన్యవంతులు కావాలన్నారు. బీసీ సోదరులు సేవా రంగాలు, నాటక రంగాలు, పాత్రికేయ రంగాలలో రాణిస్తున్నారని కొనియాడారు. కృష్ణాజిల్లా బిసిఓ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కనుమూరి ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రితిక ఫౌండేషన్ బెస్ట్ నంది అవార్డులు బీసీ సోదరులకు ఇవ్వటం సంతోషకరమన్నారు. గుడివాడ బీసీ సంఘ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి గులిపల్లి ప్రభాకర్ మాట్లాడుతూ బీసీలు రాజకీయ, వ్యాపార, ఆర్థిక, రంగాల్లో విజయం సాధించాలని కోరారు. జిల్లా బిసి ఓబీసీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నీలపాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బీసీలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సంపాదించాలని తెలిపారు. అనంతరం సన్మాన గ్రహీతలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పల్లెబాట రాజా, అగస్తి ఆది విష్ణు, భవిరి శంకర నారాయణ, డాక్టర్ శ్రీనుబాబు, డాక్టర్ శ్రీకృష్ణ యాదవ్, డాక్టర్ ఎం సత్యనారాయణ బాబు, లాయర్ ఈశ్వరరావు, గుడివాడ మున్సిపల్ రెవిన్యూ అధికారి మట్ట రాజా, మల్లంపల్లి వెంకట్రావు, నున్న గణేష్ బాబు, నిడుమోలు ఓంకార్, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నగేష్, మూడేళ్ల శ్రీధర్, మూడేడ్ల ఉమా, తమ్మినేని రామ్మోహన్, మరడాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వాసవి జాగృతి గుడివాడ క్లబ్ సేవలు అభినందనీయం..

- డిప్యూటీ గవర్నర్ ఆత్మీయ కలయిక సందర్భంగా వాసవి జాగృతి గుడివాడ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు





**గుడివాడ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** వాసవి జాగృతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో డిప్యూటీ గవర్నర్ ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్యన్ గుర్రం పద్మావతి హాజరయ్యారు. తొలుత గోపూజ మరియు గోవులకు దాణ శ్రీ వాసవి కన్య పరమేశ్వరి ఆలయంలో పూజా కార్యక్రమం మరియు శివాలయంలో శివలింగానికి క్షీరాభిషేకం నిర్వహించుకుని ప్రతి నెల నిర్వహించు గుప్పెడు బియ్యం లో భాగంగా 26కెజి బియ్యం బస్తా సాయి బాబా గుడి కి అన్నదానం నిమిత్తశీ కమిటీవారికి అందచేశారు. అలాగే పేదవారికి చీరలు లుంగీలు టవల్స్ ఫాంటు షర్టు అతిథుల చేతుల మీదుగా అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ముఖ్యఅతిథి మాట్లాడుతూ జాగృతి క్లబ్ గుడివాడ వారు చక్కని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలియజేయడం జరిగింది జోన్ చైర్ పర్సన్ మాట్లాడుతు తన సందర్శించిన క్లబ్స్ లో గుడివాడ క్లబ్ వారు నిస్వార్ధమైన సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలియజేస్తూ వారిని అభినందించడం జరిగింది ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శేగు బబిత మరి యొక డిస్టిక్ కో ఆర్డినేటర్ గాదె మోహన్ బాబు క్లబ్ కార్యదర్శి కంతేటి హరినాథ్ బాబు, సభ్యులు గోళ్ళ మధు లత, కొల్లిపర పార్ధసారథి, మండ సాయిబాబు, బచ్చు ఉమామహేశ్వరరావు, జూపూడి సంపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆశీలు రద్దు చేయండి

## కాగిత..కటకం కు వినతి పత్రం ఇచ్చిన వ్యాపారులు



**పెడన,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** పెడన పట్టణ పురపాలక సంఘ ఆశీలు రద్దు కొరకు కలెక్టర్ పెడన ఎమ్మెల్యే , చైర్మన్ కి పెడన గృహనిర్మాణ వర్తక వాణిజ్య సంఘాల నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత కొన్ని దశాబ్దాలుగా పట్టణంలోని వ్యాపారులను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్న ఆసిల్ వసూళ్లు వేలం తక్షణమే రద్దు చేయాలని పార్టీ కార్యాలయంలో కలిసి వ్యాపారుల రోజువారీ ఆర్థిక ఇబ్బందులు ఆసిల్ వసూలు తీరు అందలి సమస్యను పరిష్కారం చేయాలని వినతిపత్రం అందజేయడం జరిగింది కాగిత స్పందించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారి దృష్టిలో ఈ సమస్య దీర్ఘ కాలిక సమస్యగా మారి వాటి తీవ్రత పరిణామం ఎక్కువగా ఉందని, పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా పట్టణ పురపాలక సంఘ చైర్మన్ కటకం నాగకుమారి ప్రసాద్ ని నివాస గృహం వద్ద కలిసి ఆశీల్ వసూలు సమస్య పరిష్కారం కొరకు తగు చర్యలను తీసుకుని వ్యాపార వర్గాలకు తగు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేయడం జరిగింది చైర్మన్ వారు తగు రీతిలో స్పందించి తప్పని సరిగా సహకరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమానికి పెడన గృహ నిర్మాణ వర్తక వాణిజ్య మండలి ఇతర సంఘాల నాయకులు శ్రీనివాస్ వీణం,బొలిశెట్టి బాల రాజు మోగంటి ప్రసాద్ జల్లూరి వెంకన్న కొల్లిపర పాండురంగరావు బూరగడ్డ శ్రీనివాసరావు, మామిడి ఆనంద్ అందజేశారు

## జెనిత్ బ్లాక్ ఎడిషన్ విడుదలను ప్రకటించిన బ్లెండర్స్ ప్రైడ్




**ముంబయి,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** భారతదేశపు ప్రీమియం విస్కీ బ్లెండర్స్ ప్రైడ్, బ్లెండర్స్ ప్రైడ్ జెనిత్ బ్లాక్ ఎడిషన్ విడుదలను ప్రకటించింది. ఒక నిజమైన, విలక్షణమైన అనుభవాన్ని సృష్టించడానికి ఆకర్షణీయమైన నలుపు రంగు అందాన్ని దిగ్గజపు బ్లెండర్స్ ప్రైడ్ బ్లెండ్ తో కలిపిన లిమిటెడ్ ఎడిషన్ ఇది. మెరుగైన విలాసం, విలక్షణతతు ప్రాధాన్యతనిచ్చే ఆకర్షణీయమైన నలుపు రంగు డిజైన్ లో ఉంచిన జెనిత్ బ్లాక్ ఎడిషన్ అర్హత కలిగిన విస్కీ కేవలం ఒక మిలియన్ బాటిల్స్ లభ్యతతో ప్రారంభించబడింది. బ్లాక్ ఇప్పుడు ప్రీమియం విస్కీ కోడ్స్ ను పునర్నిర్వచించే ఒక కొత్త ప్యాకేజింగ్ డిజైన్ రూపొందించడంలో ప్రధానమైన స్థానాన్ని ఆక్రమించిందని పెర్నాడ్ రికార్డ్ ఇండియా సీఎంవో దేబాశ్రీ దాస్ గుప్తా పేర్కొన్నారు.

## శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

- భక్తులకు అన్నప్రసాద వితరణ
- ప్రత్యేక పూజలు పాల్గొన్న ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** మున్సిపల్ పరిధిలోని13వ వార్డులో సోమవారం శ్రీ అంకమ్మ తల్లి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలలో కూటమి నేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు.అమ్మవారి దర్శనం అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సౌమ్య ప్రారంభించారు.ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ఆకాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనకు అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఆలయ నిర్వహణకు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశం

- వివిధ కంప్యూటర్ కోర్సులలో ఉచిత శిక్షణ

**మైలవరం,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** మైలవరం పరిసర ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మైలవరం పట్టణంలోని డా. లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రత్యేకంగా రెండు నెలల పాటు వివిధ కంప్యూటర్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఎస్ ఎస్ సి, ఇంటర్, డిగ్రీ ఆపైన అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఇల్ల రవి సోమవారం ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ బయోమెట్రిక్ డేటా ఆపరేటర్,యం ఎస్ ఆఫీస్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్స్ స్కిల్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బేసిక్ ప్రోగ్రామింగ్ కోర్సులలో ఉచిత శిక్షణ కొరకు 22 ఫిబ్రవరి 2026 ఆదివారం) లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.ఈ కోర్సుకు ఎంపికైన విద్యార్థులకు డేటా ఎంట్రీ కోర్సులలో ప్రత్యేక శిక్షణ సౌకర్యం కల్పిస్తామని,కోర్సు పూర్తి చేసి అభ్యర్థులకు ధృవపత్రాలను అందజేయడం తో పాటు ప్రాముఖ్యత గల సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు వెల్లడించారు.ఆసక్తి, అర్హత కలిగి 18 సంవత్సరాలు నిండిన నిరుద్యోగ యువతీ యువకులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, ఇమెయిల్ ఐడి, మొబైల్ నెంబర్ డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి డిగ్రీ కళాశాల మైలవరం నందు ఉదయం 10 గంటలకు సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు 8247766718 , 9502757755 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

## అయ్యప్ప స్వామి దేవస్థానం వద్ద రెండో రోజు కొనసాగిన మజ్జిగ పంపిణీ..



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గుడి దిబ్బ గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి దేవస్థానం నందు రెండో రోజు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి దైవ దర్శనానికి వచ్చిన భక్తుల దాహార్తిని తీర్చడానికి స్థానిక అయ్యప్ప స్వామి దేవస్థానం నందు ఆలయ కమిటీ చైర్మన్ మరియు కోమళ్ళపూడి పిఏసిఎస్ అధ్యక్షుడు కూనసాని నాగబాబు, మాతృమూర్తి కూనసాని కృష్ణవేణి పేరుమీద రెండో రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృత్తివెన్ను ఎస్సై ఏ పైడి బాబు తమ సిబ్బందితో కలసి ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉద్యోగుల బకాయిలపై నిర్ణయాన్ని అసెంబ్లీ లో ప్రకటించాలి

- ఐక్యవేదిక చైర్మన్ కె. ఆర్. సూర్యనారాయణ
- విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేయాలి






**విజయవాడ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** 12వ పి.ఆర్.సి గడువు పూర్తి అయ్యి 30 నెలలు దాటినా ఇప్పటి వరకు కమిషన్ వేయకపోవడం పట్ల ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాధరపురంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఐక్య వేదిక సభ్య సంఘాల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో త్రిసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలపై నిర్ణయాన్ని రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించాలని, ప్రభుత్వ బకాయిలకు ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించాలని దీని వలన అటు ప్రభుత్వానికి ఇటు ఉద్యోగులకు మంచి జరుగుతుందని సూచించారు. ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు కేటాయించడం ద్వారా గృహ నిర్మాణ కార్మికులకు పూర్తిస్థాయిలో పని దొరుకుతుందని తద్వారా అటు కార్మికులకు ఇటు ఉద్యోగస్తులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. రివైజ్డ్ పెన్షన్ డ్రాఫ్ట్ రూల్స్ 2026 ప్రధానంగా దీనిలో ఉన్నటువంటి సమస్యలను గురించి వివరంగా చర్చించారు. ఈ రూల్స్ గురించి ఉద్యోగుల ఆందోళన అర్థం చేసుకుని ప్రభుత్వం ఉద్యోగులకు ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉండేలా తాము ప్రాతినిధ్యం వహిస్తామని హామీ ఇచ్చారు. ఓ పి ఎస్ అమలుపరిచేలా ప్రభుత్వాన్ని కోరుతామని, డిఏల చెల్లింపులో పెన్షనర్ల కు ఎడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ అమలు, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉపాధ్యాయులకు పనిభారం కలిగించే చర్యలను తొలగించేలా సమస్యలకు సరైన పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. పని ఒత్తిడికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు గురికాకుండా పని భారాన్ని తగ్గించాలని కోరారు. తగు మార్గదర్శకాలు ప్రభుత్వం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు పని భారంతో చనిపోవడంపై సభ్య సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఐక్యవేదిక సమావేశం మార్చి రెండవ వారంలో ఏర్పాటు చేస్తామని ఉద్యోగుల సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించి కార్యాచరణను ప్రకటిస్తామని సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా మార్చి 7న రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉద్యోగులతో నిర్వహించబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవ కరపత్రాలను ప్రతి జిల్లా నుండి వచ్చిన ప్రతినిధులకు అందజేసి విస్తృతంగా ప్రచారం చేపట్టాలని అత్యధిక సంఖ్యలో మహిళలు, మహిళా ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర మహిళ విభాగ అధ్యక్షురాలు డాక్టర్ పామర్తి లీలావతి కోరారు. సమర్ధుడైన నాయకుని ఆధ్వర్యంలో ఈ ఐక్యవేదిక తలపెట్టిన కార్యక్రమాలకు సైనికులవలె క్రమశిక్షణతో పనిచెయ్యాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు అలసత్వం వహించకుండా సరైన మార్గదర్శకత్వం, రూల్స్ దానికి సంబంధించిన సరైన సమాచారంతో విద్యావంతులైన ఉద్యోగులు ప్రజాస్వామ్య పద్ధతిలో కృషి చేద్దామని తెలిపారు. ఉద్యోగుల సమక్షంలో సీ. పీ. ఎస్. కు వ్యతిరేకంగా మార్చి 1 న విశాఖపట్నం లో చేపట్టబోయే 'సీ. పీ. ఎస్. తుఫాన్ ' పోస్టర్లను అధ్యక్షులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ బాజీ పటాన్, మాగంటి శ్రీనివాసరావు, ఏపీజీఏ ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ కుమార్, ఉపాధ్యక్షులు కేదారేశ్వర రావు, వెంకటేశ్వర రెడ్డి, కరిమి రాజేశ్వరరావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పి రామచంద్రారెడ్డి కె.వి.రమణ మహిళా నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు డి. మంజుల దేవి, రేణుక, సుధా శ్రీనివాస్, సంపూర్ణ సభ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# కాకినాడలో సీపీఐ రాష్ట్ర సమావేశాలు ప్రారంభం

## -చట్టసభలు, స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లకై సీపీఐ పోరాటం




**కాకినాడ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** బీసీ కులాలు ఐక్యంగా సమరశీల పోరాటాలకు సమయత్తం కావాలని జనగణనలో సమగ్రంగా కులగనన చేపట్టి జనాభా ప్రాతిపదికన బీసీలకు చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని, రాజకీయ సామాజిక ఆర్థిక సమానత్వం కోసం క్రియాశీలక పోరాటాలకు సన్నద్ధం కావాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాలు కాకినాడలోని సూర్య కళామందిరంలో ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి వరకు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తాటిపాక మధు అధ్యక్షతన జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య, గత స్థానిక సంస్థలలో బీసీలకు కేటాయించిన స్థానాలు తగ్గించడం వలన వేల సంఖ్యలో స్థానిక సంస్థలకు చెందిన పదవులను బీసీలు కోల్పోయారని తెలంగాణాలో ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కులగణన చేపట్టి, అందుకనుగుణంగా ఎస్సి, ఎస్టి, బీసీలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయిస్తూ అసెంబ్లీలో రెండు బిల్లులు ఆమోదించిందన్నారు. అదే విధంగా మన ఆంధ్రప్రదేశ్లో కూడా జనగణనలో కులగణన చేపట్టి, కులాల ప్రాతిపదికన బిసిలకు స్థానిక సంస్థలలో సీట్లు కేటాయించాలని సిపిఐ డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. "పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయం, హోదాల్లోనూ అవకాశాల్లోనూ సమానత్వం" ఇవి భారత రాజ్యాంగంలో మొదటి పేజీలో మనకు మనం రాసుకున్న మూల సూత్రాలు ఈ మహోన్నత లక్ష్యాలతో ఒక న్యాయపూర్వక సమాజాన్ని నిర్మించాలని సంకల్పించి 76 సంవత్సరాలు కావస్తున్నా ఈ లక్ష్య సాధనకు అవసరమైన సమగ్ర కులగణన ఇప్పటికీ జరగలేదంటే ఎవరు ఎంత వెనుకబడి ఉన్నారు. ఎవరికి ఎంత అన్యాయం జరుగుతోంది. మన రాజ్యాంగ లక్ష్యాలు ఎంత దూరంలో ఉన్నాయి? ప్రశ్నలకు సమాధానాలు మనకు డేటా లేకపోవడం వలన తెలియడంలేదని ఈశ్వరయ్య అన్నారు. వెనుకబడిన వర్గాల (బీసీ) జాబితాలో ఉన్న కులాలు రాజకీయ శక్తి, విద్య, ఉద్యోగాలు, ఆర్థిక వనరులలో తమకు రావాల్సిన హక్కులను కోల్పోతున్నాయని కులగణన జరగకపోవడంవల్ల ఏర్పడుతున్న నష్టాలు అపారమైనవి కులగణనను కేవలం జనాభా లెక్కలకు పరిమితం చేయకుండా, కులాల వారీగా ఆర్థిక, రాజకీయ మరియు సామాజిక స్థితిగతులు, సంపద పంపిణీ, అవకాశాల సమానత్వాన్ని తెలుసుకునే విధంగా సమగ్రంగా జరిపించాలని డిమాండ్ చేశారు. దేశంలో 50 శాతానికి పైగా బీసీలున్నారని అయితే ఖచ్చితమైన లెక్కలు ప్రభుత్వం తేల్చాలని ఆ ప్రాతిపదికన చట్టసభలలో రిజర్వేషన్లు కల్పించాలని సిపిఐ జాతి కార్యదర్శి డాక్టర్ కే నారాయణ డిమాండ్ చేశారు. కులగణాలలో సామాజిక, ఆర్థిక ,రాజకీయ స్థితిగతులు సమగ్రంగా జనగణన జరపాలని అందుకు అనుగుణంగా చట్టసభలలో స్థానిక సంస్థలలో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని అందుకోసం సిపిఐ క్రియాశీలక పోరాటాలకు సన్నద్ధమవుతుందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు జన గణనలో కుల గణన జరిపించాలని తీర్మానం చేయించి అందుకు కావలసిన కార్యాచరణ తీసుకొచ్చే విధంగా ఆయా రాజకీయ పార్టీల బీసీలు నాయకులు ఒత్తిడి తీసుకురావాలన్నారు. కుల గణనలో జనగణన సమగ్రంగా సామాజిక ,ఆర్థిక , రాజకీయ రాజకీయ స్థితిలు నమోదు చేసుకోవాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ కార్యాచరణ రాష్ట్ర సమితి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సిపిఐ జాతీయ కమిటీ సభ్యుడు కే రామకృష్ణ అన్నారు. ఇంకా ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, అక్కినేని వనజ, ముప్పాళ్ల నాగేశ్వరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, పి హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# రజకుల సమస్యల పరిష్కారం కోసం జరిగే మహా ధర్నా ను జయప్రదం చేయండి

- ఏపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య



**జి.కొండూరు,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** రజకుల సమస్యల పరిష్కారం, రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 20వ తేదీన తాడేపల్లిలో జరిగే మహా ధర్నా ను జయప్రదం చెయ్యాలని ఏపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య పిలుపునిచ్చారు.ఏపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చిక్కవరపు రెడ్డయ్య తో కలిసి ఎన్ టి ఆర్ జిల్లా, జి.కొండూరు గ్రామా నికి విచ్చేసి స్థానిక రజక సంఘం నాయకులను కలిసి రజక సంఘం కార్యాలయం వద్ద మహా ధర్నా కు సంబందించి కరపత్రాలను ఆవిష్కరిం చారు.అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి స్వతంత్రం వచ్చి 78 సంవత్సరాలు పూర్తయినా నేటికీ సమాజంలో వెనుకబడిన తరగతుల ప్రజలపై కుల వివక్షత వివిధ రూపాల లో కొనసాగుతూనే ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రజక వృత్తి అంతరించడం, నేడు పట్టణీకరణ అభివృద్ధి చెందుతుండడంతో రజకులు పట్టణా లకు వలసవెళ్లి అపార్ట్మెంట్ వాచ్మెన్-కం- ఇస్త్రీ దారులుగా జీవనోపాధి పొందుతున్నారనీ,పట్టణ ప్రాంతాల్లో అపార్ట్మెంట్ వాచ్మెన్లను రాష్ట్ర ప్రభుత్వం కార్మికశాఖ ద్వారా సర్వే నిర్వహించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పాగోలు దశరథ రామయ్య జి.కొండూరు రజక సంఘం నాయకులు బుద్ధవరపు తిరపతి, వెంకటేశ్వరమ్మ, తాళ్లూరు శివన్నారాయణ, బుద్దారపు సురేష్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

# జీతం కోరితే వేధింపులా?..

- సహకరిస్తున్న దారపురెడ్డి
- ఎస్.ఆర్. పేరుతో కొర్రీ



**కాకినాడ, ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** త్వరలో పదవీ విరమణ చేయనున్న సూపరింటెండెంట్ స్థాయి ఉద్యోగిని వేధింపులకు గురిచేసిన వైనం ఎస్సీ కార్పొరేషన్ అధికారులకే దక్కుతుంది. వివరాల్లోకి వెళితే కాకినాడ ఎస్సీ కార్పొరేషన్లో సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న డి.వి.వి.ఎ.ఎస్.ఎన్. రాజు ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు. వయసురీత్యా వెన్నునెప్పి, గుండె సమస్యలతో బాధపడుతున్న ఆయనకు గత 7 నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఆఫీసులో పనిచేసే కొందరు అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆయన భార్య చిరంజీవి ఈ నెల 13న జిల్లా కలెక్టరేట్లో అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సర్వీసు రిజిస్టర్లో నమోదుకాలేదని ఆఫీసులో జీతాలకు సంబంధించిన తాత్కాలిక ఉద్యోగి దారపురెడ్డి శ్రీనివాసరావు చెబుతున్నట్టు తెలిసింది. పైగా గతంలో కూడా అనేక ఫిర్యాదులు శ్రీనివాసరావుపై వచ్చినప్పటికీ ఈ శాఖలో పైస్థాయి అధికారులు సహకరిస్తున్నట్టు వినికిడి. జీతానికి, ఎస్.ఆర్.కు సంబంధం లేదని, తన భర్తకు జీతం చెల్లించకపోతే హ్యూమన్ రైట్ కమిషన్ కు ఫిర్యాదుచేస్తానని చెప్పగా, జీతం చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారు. తినడానికి డబ్బులు లేకపోగా, పిల్లల ఫీజు కూడా చెల్లించకపోవడంతో కాలేజీకి రానీయలేదని ఆమె లేఖలో పేర్కొన్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేయగా కొంత శాలరీ అడ్వాన్సుగా ఇచ్చారని, దాంతో కక్షపెట్టుకుని తన భర్తను సరెండ్ చేశారన్నారు. ఈ నెల 8వ తేదీన తన భర్త అనారోగ్య కారణంగా మెడికల్ లీవు సమర్పించారని, తిరిగి విధుల్లో చేరేందుకు ఫిట్నెస్ సమర్పించగా 13వ తేదీన సరెండర్ చేయడం సబబు కాదన్నారు. ఈ విషయంపై ఇంతవరకు లిఖితపూర్వక సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే లిఖితపూర్వక ఆధారాల్లేకుండా సరెండర్ చేయడం ఎంతవరకు సబబని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. సొమ్ములిస్తేగానీ జీతాలివ్వనని దారపురెడ్డి శ్రీనివాసరావు చెప్పారని, మెడికల్ లీవులో వున్న తన భర్త ఫిట్ సమర్పించాక రిలీవ్ కావడానికి నెలరోజులు గడువు ఇప్పించి తనకు న్యాయం చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# శివరాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు




**నందిగామ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** మహాశివరాత్రి పురస్కరించుకొని మండలాల్లోని పలు శైవ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. దక్షిణ కాశీ గా పేరుగాంచిన కూడలి సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కళావేదికపై తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణానికి చెందిన ఇందు నృత్యాలయం శిష్య బృందంచె కూచిపూడి, భరతనాట్యం జానపద నృత్యాలు అందరిని అలరించాయి. నందిగామ పట్టణానికి చెందిన చలమల మురళీకృష్ణ ఆధ్వర్యంలో సాయి కృష్ణ మహిళా కోలాట భజన మండలిచే ఏర్పాటుచేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులను జొన్నలగడ్డ గ్రామానికి చెందిన విజయవాడ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యురాలు మన్నే కళావతి, ఆలయ కమిటీ చైర్మన్ గింజుపల్లి శ్రీనివాసరావు ఏటిపట్టు గ్రామాల నాయకులు తో పాల్గొన్నారు. ఈ ఉత్సవాలలో తోట నాగమల్లేశ్వరరావు చెరుకూరు హైమారావ్, చల్లా తులసి రావు, చింతొటిసాంబశివరావు లను జ్ఞాపికలు శాలవాలతో ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. పల్లగిరి గట్టుపై గల భవాని శంకర్ స్వామి, మునేటి తీరాన గల విజ్ఞాన నందీశ్వర స్వామి ఆలయ ప్రాంగణాలలో సాంస్కృతి కార్యక్రమాలు సూపర్ ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# టిడిపి అధికార ప్రతినిధి కూనసాని చిన్నాను ఘనంగా సత్కరించిన కూటమి నాయకులు....



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా టిడిపి అధికార ప్రతినిధిగా నియమితులైన మండలానికి చెందిన కూనసాని చిన్నాను సోమవారం పెడన నియోజకవర్గం శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ సమక్షంలో కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. కూనసాని చిన్నాను సన్మానించిన వారిలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒడుగు తులసిరావు, బంటుమిల్లి మండల టిడిపి అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు,డి సి బొర్రా. కాశీ, కృత్తివెన్ను టిడిపి మండల అధ్యక్షుడు నాగిడి చెన్నకేశవరావు, జెన్యావుల శీను, గుమ్మల్ల రాజగోపాల్, సుంకర బాబురావు, పిన్నింటి రాంబాబు, నాగుల్ మీరా, మరియు ఎండపల్లి చెరుకుమిల్లి కూటమి నాయకులు పాల్గొన్నారు...

# తాగునీటి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగు నీరు అందిస్తామని ఇచ్చిన హామీలో భాగంగా జల జీవన్ మిషన్ నిధులతో 1650 కోట్ల వ్యయంతో అఖండ గోదావరి నుండి త్రాగునీరు అందించేందుకు చేస్తున్న ప్రాజెక్ట్ లో భాగంగా ఐదు గ్రామాలకు త్రాగునీరు అందించే ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది. సుమారు 96.82 లక్షలతో పైపు లైన్ల నిర్మాణాలకు రెండిటికీ కలిపి రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సోమవారం స్థాపన చేశారు. కాకినాడ రూరల్ మండల కొవ్వాడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొని పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాలలో ప్రతి ఒక్క ఇంటికి త్రాగే నీరు అందించేందుకు కూటమి ప్రభుత్వంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ ఆశయాలతో ఇక్కడి ప్రజలకు త్రాగు నీటి కష్టాలు శాశ్వతంగా తీర్చేందుకు ఈ ప్రాజెక్టు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఎవరైనా ఇంటికి కుళాయి కనెక్షన్ అందించేందుకు డబ్బులు డిమాండు చేసిన అవినీతికి పాల్పడిన స్థానిక నాయకుల దృష్టికి ప్రజలు తీసుకురావాలని, పూర్తి ఉచితంగా ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతి ఒక్కరికి కుళాయి కనెక్షన్ అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెంకే శ్రీనివాస్ బాబా, చప్పిడి వెంకటేశ్వరరావు,కడలి ఈశ్వరి, శిరంగు శ్రీనివాస్, మట్ట ప్రకాష్ గౌడ్ , కరెడ్ల గోవింద్ , దూడల నారాయుడు , నురుకుర్తి వెంకటేశ్వరరావు, రంభాల వెంకటేశ్వరరావు, కోటిపల్లి ఉమా సతీష్, గుమ్మడి వీరబాబు, రెడ్డిపల్లి కిషోర్, ర్యాలీ సతీష్, వసంత గోపాల్, పద్మవతి, తాతాజీ , శాంత, మాలతి, సుబ్రహ్మణ్యం, లచ్చుబాబు, నాగబాబు, అధికారులు పాల్గొన్నారు.




నందికొట్కూరు నియోజక వర్గం క్యాలెండర్ ను యాదవ సత్రం లో ముఖ్య బాధ్యులు పి.ఎల్.పి.యాదవ్ తదితర నాయకులు ఆవిష్కరిస్తున్న చిత్రం

**–శ్రీశైలం,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :**

# కనుల పండుగ స్వామి వారి తెప్పోత్సవం

- హంస వాహనంపై స్వామి వారి దర్శనం



**కృత్తివెన్ను,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను గ్రామంలో గుడి దిబ్బ నందు కొలువై ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీ నాగేశ్వర స్వామి వారు సోమవారం సాయంత్రం మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని కోనేరు నందు ప్రత్యేక హంస వాహనంపై తెప్పోత్సవ కార్యక్రమానికి కొలువు తీరారు. స్వామివారిని ప్రత్యేకహంస వాహనంపై కోనేరు లో అంగరంగ వైభవంగా విద్యుత్ కాంతులతో బాణ సంచాలతో శివన్నామస్మరణతో ఊరేగించారు వేలాది మంది భక్తులు ఈ విశేషమైన తెప్పోత్సవానికి బయలుదేరి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ కాంతులతో బాణసంచా మెరుపులతో మార్మోగింది ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఆలయ నిర్వాహకులు మరియు వేలాది మంది భక్తులు ప్రత్యక్షంగా పాల్గొని స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందారు

# మీ నిర్లక్ష్యానికి ఎదుటి వారి ప్రాణం బలిచెయ్యొద్దు..




**చల్లపల్లి: అవనిగడ్డ,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** అతివేగం ప్రమాదకరమని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చల్లపల్లి పోలీసులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. గతంలో ప్రమాదానికి గురైన కారును తీసుకువచ్చి 216 జాతీయ రహదారి పక్కన ఉంచారు. దానిపై ప్రమాదాలు జరిగిన వాహనాల ఫొటోలు ముద్రించి అంటించారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారిని దీని ద్వారా అప్రమత్తం చేసి వారు సురక్షితంగా గమ్యం చేరాలనే ఉద్దేశ్యంతో ఇలా ఏర్పాటుచేసినట్లు చల్లపల్లి ఎస్ఐ డి.దుర్గాంజనేయులు తెలిపారు.

# చంద్రబాబు నాయుడు అభినందనలు అందుకున్న ఏ డి ఇ బొజ్జగాని శ్రీనివాస రావు



**హనుమాన్ జంక్షన్,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** కుగ్రామాల్లో సైతం విద్యుత్ వినియోగదారులకు విశేష సేవలందిస్తున్న ఏపీ సీపీడీసీఎల్ హనుమాన్ జంక్షన్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బొజ్జగాని శ్రీనివాసరావు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను కలుసుకున్నారు. విద్యుత్ శాఖలో విశేష సేవలందిస్తున్న డి.ఇ.ఇ శ్రీనివాసరావు ను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. హనుమాన్ జంక్షన్ సబ్ డివిజన్ కు వచ్చిన అనతికాలంలో క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచి తనకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారు. ప్రభుత్వం ఆయన సేవలు గుర్తించి పలు అవార్డులు అందించింది.

# శివాలయాల్లో కాగిత ప్రత్యేక పూజలు



**పెడన,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గం గూడూరు మండలం కంకటావ తారకటూరు గ్రామంలో వేచి ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గోపి నాగ బాబు కూటమి నాయకులు గ్రామ నాయకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



ఢిల్లీ నుంచి వచ్చిన ఢిల్లీ పోలీస్ అధికారిణులు ఎస్ ఐ లక్ష్మీ, ఏ ఎస్ ఐ సావిత్రి,హెడ్ కానిస్టేబుల్ రేఖ లు శ్రీ అఖిల భారత శ్రీకృష్ణ (యాదవ)అన్న దానా సత్రంలో 5,000 అన్నదానం కోసం సత్ర ప్రముఖులు పి.ఎల్.పి.యాదవ్ కు అందచేస్తున్న చిత్రం

**–శ్రీశైలం,ఫిబ్రవరి 16 (వార్తాప్రభ) :**

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188